**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 89, పేజీలు - 08

సోమవారం, సెప్టెంబర్ 28, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD








# సర్కారీ భూమికి కన్నం

## దొంగ పత్రాలతో ప్రభుత్వ భూమి ఆక్రమణ!

- 'ప్రజా ప్రశ్న' వెలుగులోకి తెచ్చిన సంచలన బండారం
- భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కు పూర్తి నివేదిక పంపిన మేడ్చల్ కలెక్టర్
- చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) స్పష్టమైన ఆదేశాలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం బండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్ 36/5 లోని దాదాపు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి స్వాహా చేసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. అసలు రాచకొండ కనకయ్య అనే వ్యక్తి స్వాతంత్ర్య సమరయోధుడు (ఫ్రీడమ్ ఫైటర్) కాకపోయినప్పటికీ, ఆయన పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న భారీ కుంభకోణంపై సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ చేస్తున్న పోరాటాన్ని పూర్తి ఆధారాలతో 'ప్రజా ప్రశ్న' వెలుగులోకి తెచ్చింది. ఈ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ యంత్రాంగం మరియు ఉన్నతాధికారులు స్పందించారు.

### అక్రమ నిర్మాణాలు - అమ్మకాలు:

రాచకొండ కనకయ్య పేరుతో ఉన్న ఆ 10 ఎకరాల భూమిలో ఎలాంటి అసలు అబ్జర్వేషన్ ఫైళ్లు, రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో లేకపోయినా, దీనిని అడ్డుపెట్టుకుని సాధారణ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)లు, రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లు చేసుకుంటూ పోయారు. ఈ క్రమంలో శ్రీ చక్ర డెవలపర్స్, కీర్తి కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ చేతులు మారుతూ చివరికి 'పల్లవి డీబీఆర్' (పల్లవి డెవలపర్స్) పేరుతో భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని అమాయక ప్రజలకు ప్లాట్లుగా, భవనాలుగా విక్రయించి కోట్లు దండుకున్నారు. ప్రస్తుతం ఆ భూమిలో బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్లు, స్వతంత్ర గృహాలు (ఇండిపెండెంట్ ఇళ్లు) వెలసినట్లు అధికారులు గుర్తించారు.

### సీసీఎల్ఏకు కలెక్టర్ సమగ్ర నివేదిక:

ఈ భారీ భూ కుంభకోణంపై పూర్తి స్థాయిలో స్పందించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సమగ్ర నివేదికను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కి పంపడం జరిగింది. అసలు రికార్డులలో ఎలాంటి అసైన్‌మెంట్ ఫైళ్లు, ఫైసల్ పట్టీలు లభించలేదని, కేవలం 1987-88 పహణీ నుంచి మాత్రమే అక్రమంగా రాచకొండ కనకయ్య పేరు వచ్చి చేరిందని నివేదికలో స్పష్టం చేశారు. హోమ్ శాఖ మరియు విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించగా రాచకొండ కనకయ్య స్వాతంత్ర్య సమరయోధుడు అనడానికి ఎలాంటి ఆధారాలు, రికార్డులు లభించలేదని స్పష్టమైంది.

### తెలంగాణ రాష్ట్ర చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సీరియస్:

దొంగ స్వాతంత్ర్య సమరయోధుడు ధ్రువీకరణ పత్రాలు, నకిలీ పత్రాల ద్వారా 10 ఎకరాల సర్కారీ భూమి ఆక్రమణకు గురైన వైనంపై మరింత స్పష్టతనిస్తూ అధికారిక పత్రాలు వెలుగుచూశాయి. ఒక దినపత్రికకు చెందిన ప్రతినిధి 08-07-2026 నాడు గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించిన ఫిర్యాదుపై 'ఆఫీస్ ఆఫ్ ది తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ' (టీఎస్ఎల్ఎస్ఏ) తీవ్రంగా స్పందించింది. ఈ మేరకు టీఎస్ఎల్ఎస్ఏ పరిపాలనాధికారి (సీనియర్ సివిల్ జడ్జి హోదాలో) ప్రొసీడింగ్స్ నంబర్ రాక్.నెం.3620/టీఎస్-ఎల్ఎస్ఏ/2026, తేదీ: 30.07.2026 ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పిటిషనర్ ఫిర్యాదుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల నివేదికను వెంటనే సమర్పించాలని ఆ లేఖలో స్పష్టంగా ఆదేశించారు. ఇదే అంశానికి సంబంధించి గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయానికి కూడా ఓసీజే ఆర్సీ.నెం. 1504/2026, తేదీ: 09.07.2026 ద్వారా సమాచారం అందించినట్లు ఆ పత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కొన్ని వ్యవస్థల అపవిత్ర ప్రమేయంతోనే ఇక్కడ నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీలు) జారీ కావడం, జీహెచ్ఎంసీ అనుమతులు పొందడం జరిగిందని తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) మరింత గట్టిగా దృష్టి పెట్టడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉగ్రవాదాన్ని భారత్ ఉపేక్షించదు

## - మన్ కీ బాత్ లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్‌పై తొలిసారి చేసిన సర్జికల్ దాడులకు 10 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ వైపు కన్నెత్తి చూస్తే రిజల్ట్ ఎలా ఉంటుందంటే పాకిస్తాన్‌పై చేసిన సర్జికల్ స్ట్రైక్స్ నుంచి ఇటీవల చేసిన ఆపరేషన్ సిందూర్ లాంటి ఫలితాలు తప్పవన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఉగ్రవాదం, పాక్ గురించి మాట్లాడారు. ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ, మొదట పీఓకేలో, ఆపై కొంతకాలానికి బాలాకోట్‌లో భారత్ చేసిన సర్జికల్ స్ట్రైక్స్‌ను చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయిందని అన్నారు. మన దేశానికి ఉగ్రవాద వ్యతిరేక విధానం ఉందని, ఈ దాడి ద్వారా ఆ సందేశం అందరికీ చేరుకుందని ప్రధాని మోదీ తెలిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ 'దేశప్రజలందరికీ స్వాగతం పలుకుతున్నాను. 'మన్ కీ బాత్'లో దేశవాసుల సానుకూల

2లో..

# రూ.30,491 కోట్ల దారి

## - అమరావతి ఓఆర్ఆర్‌పై కీలక అప్ డేట్



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ ఓఆర్ఆర్‌ను నాలుగు ప్యాకేజీలుగా నిర్మించాలని ప్లాన్ చేశారు. మొత్తం 189.93 కి.మీ.మేర ఆరు వరుసలతో నిర్మిస్తారు. అలాగే నారాకోడూరు నుంచి గుంటూరు శివారు బుడంపాడు దగ్గర వరకు 5.2 కిలోమీటర్లు నాలుగు వరుసలుగా స్పర్ రోడ్డు కూడా కలిపి మొత్తం 195.13 కిలోమీటర్లు ఉంటుంది. అమరావతి ఓఆర్ ఓఆర్‌ను నాలుగు ప్యాకేజీలుగా విభజించి ఎన్‌హెచ్ఏఐకు ప్రతిపాదనలు పంపించారు. ఈ ఔటర్ రింగ్‌రోడ్డులో కృష్ణా నదిపై రెండు చోట్ల బ్రిడ్జిలు, 3 సొరంగాలు సహా అన్ని కలిపి నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. వాస్తవానికి గతంలో 25-30 కి.మీ.లకు ఒక ప్యాకేజీ చొప్పున ఆరు నుంచి ఎనిమిది ప్యాకేజీలుగా నిర్మించాలనుకున్నారు. అయితే ప్యాకేజీలు తక్కువగా ఉండాలని అధికారులు సూచించడంతో నాలుగు ప్యాకేజీలకు తగ్గించారు.

### కంచికచర్ల నుంచి మొదలై..

అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల దగ్గర విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవే నుంచి మొదలై.. కొండపల్లి, పంగిడి అటవీ ప్రాంతాల మీదుగా మైలవరం దగ్గర 27వ కిలోమీటర్ వరకు రెండు సొరంగాలు కలిపి మొదటి ప్యాకేజీగా నిర్ణయించారు. మైలవరంలో 27వ కిలోమీటర్ నుంచి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్ను సమీపంలోని 83వ కి.మీ.వరకు రెండో ప్యాకేజీ మొత్తం 56 కిలోమీటర్లు ఉంటుంది.

2లో..

# యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం

## - 22ఏ చిక్కుముడులపై మంత్రి పొంగులేటి క్లారిటీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) దరఖాస్తుల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం 2016లోనే యూఎల్‌సీ కింద పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు జీవో జారీ చేసినప్పటికీ, దానిని అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.

2లో..

# ప్రపంచ టూరిజం డెస్టినేషన్‌గా తెలంగాణ

## - సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

- అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తాం
- టూరిజం పాలసీ 2025--30తో పెట్టుబడులకు ప్రోత్సాహం
- ఎకో, టెంపుల్, హెరిటేజ్, మెడికల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్రాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ పర్యాటకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని సహజ, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రత్యేకతలను ప్రపంచానికి మరింతగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు అనేక రకాల పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అడవులు, వన్యప్రాణి అభయారణ్యాలు, చెరువులు, జానపద కళలు, సంప్రదాయ పండుగలు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి మరింత మంది దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. (రామప్ప, వరంగల్,

2లో..

# నాలుగేళ్లలో 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ మారారు!

## - ఏడీఆర్ సంచలన నివేదిక

- నాగాలాండ్‌లో 32, పశ్చిమ బెంగాల్‌లో 20 మంది ప్రజాప్రతినిధుల ఫిరాయింపు
- ఎన్‌డీపీపీ, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల నుంచి అత్యధికంగా వలసలు
- ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని కఠినతరం చేయాలని ఏడీఆర్ సిఫార్సు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** భారత రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. కేవలం నాలుగేళ్ల వ్యవధిలో దేశవ్యాప్తంగా 111 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఒక పార్టీ నుంచి మరో పార్టీలోకి మారారని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్

2లో..

# అందరి లెక్కలు తేల్చుతాం

## - కేటీఆర్ స్ట్రాంగ్ వార్నింగ్

- అధికారంలోకి రాగానే ఒక్కో లెక్క బయటకు తీస్తాం - కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- అణచివేత ఎక్కువైతే గడ్డిపోచలే గడ్డపారలవుతాయంటూ వ్యాఖ్యలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. తిరిగి తమ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేస్తూనే ఎవరు ఏం చేస్తున్నారో తమకు తెలుసని చెప్పారు. అధికారం లోకి రాగానే అన్ని లెక్కలు బయటికి తీస్తామని హెచ్చరించారు. పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ లో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పోలీసు అధికారుల పైన ఆగ్రహం వ్యక్తం చేసారు. బీఆర్ఎస్ ముఖ్య నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. రాజేంద్రనగర్ నియోజక వర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి త్వరలో మూడేళ్లు పూర్తవుతున్నా..

2లో..

### కూటమి శ్రేణుల మధ్య సమన్వయమే

# విజయానికి కీలకం

## - స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్డీఏ సమావేశం



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసి, క్షేత్రస్థాయిలో సమష్టి కార్యాచరణతో ముందుకు సాగేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విశాఖపట్నంలోని టీడీపీ జోనల్ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి సమన్వయ సమావేశం నిర్వహించి, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత, కూటమి పార్టీల మధ్య సమన్వయం, నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.

2లో..

# ఏఐ ఏజెంట్ల శిక్షణ నిలిపివేత

## - ఓపెన్‌ఏఐ సంచలన నిర్ణయం




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ సంచలన నిర్ణయం తీసుకుంది. తమ అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడళ్లకు సంబంధించిన శిక్షణ, అభివృద్ధి, ఇతర టూల్ ఆధారిత వినియోగాన్ని తక్షణమే నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. శిక్షణలో ఉన్న ఒక ఏఐ ఏజెంట్, సంస్థ విధించిన ఇంటర్నెట్ భద్రతా వలయాన్ని ఛేదించుకుని ప్రభుత్వ వెబ్ సైట్లలోకి చొరబడడమే ఇందుకు కారణం. ఈ ఘటనతో అప్రమత్తమైన ఓపెన్‌ఏఐ, భద్రతా లోపాలను సరిదిద్దే వరకు ఈ పాక్షిక విరామం కొనసాగుతుందని స్పష్టం చేసింది. సెప్టెంబర్ 20న ఒక శిక్షణా కార్యక్రమంలో ఈ అనూహ్య ఘటన చోటుచేసుకున్నట్లు ఓపెన్‌ఏఐ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. ఒక సెర్చ్ ఆధారిత టాస్క్‌లో భాగంగా, ఈ ఏఐ ఏజెంట్ లైవ్ ఇంటర్నెట్‌కు దూరంగా, ఆఫ్‌లైన్‌లో నిల్వ చేసిన వెబ్ సమాచారంతో మాత్రమే పనిచేయాల్సి ఉంది. అయితే, సంస్థ నెట్‌వర్క్‌లోని డొమైన్ నేమ్ సిస్టమ్ (డీఎన్ఎస్) ఫిల్టరింగ్‌లో ఉన్న ఒక చిన్న లోపాన్ని ఈ ఏఐ కనిపెట్టింది. దాని ద్వారా నిర్దేశించిన

2లో..

# ఉగ్రవాదాన్ని భారత్ ఉపేక్షించదు

ప్రయత్నాలకు వేదిక కల్పిస్తున్నాం. దేశం సాధించిన విజయాల గురించి చర్చించుకుందాం. దేశం సాధించిన అలాంటి ఒక గొప్ప చారిత్రాత్మక విజయానికి మరో 24 గంటల్లో 10 ఏళ్లు పూర్తి కాబోతున్నాయి. ఆ విజయమే పాక్ మీద చేసిన సర్జికల్ స్ట్రైక్' అని పేర్కొన్నారు.

### మనది ఉగ్రవాద వ్యతిరేక విధానం - ప్రధాని మోదీ

ప్రధానిమోదీ 2016 సెప్టెంబర్ 28-29 రాత్రిని గుర్తుచేసుకున్నారు. జమ్మూ కశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతిచర్యగా దాదాపు పదేళ్ల క్రితం 2016 సెప్టెంబర్ 28-29న భారత సైన్యం పాకిస్తాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రైక్స్ చేసింది. ఎల్ఓసీ దాటి వెళ్లి మన వీర జవాన్లు ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపిన తీరు చూసి ప్రపంచం ఆశ్చర్యపోయింది. సర్జికల్ స్ట్రైక్స్ ద్వారా భారత్ తన ఉగ్రవాద వ్యతిరేక విధానానికి సంబంధించి ఒక కొత్త ఉదాహరణను ప్రపంచానికి చాటి చెప్పిందని అన్నారు. 2019 ఫిబ్రవరిలో పాక్ చేసిన పుల్వామా దాడిలో భారత సీఆర్పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. అందుకు ప్రతీకారంగా భారత్ పాకిస్తాన్‌లోని బాలాకోట్ ప్రాంతంలో భారత వాయుసేన మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. తమ జోలికొస్తే శత్రువులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. ఉగ్రదాడుల కారణంగా భారత్ సుదీర్ఘకాలంగా అనుభవించిన వేదనకు సర్జికల్ స్ట్రైక్ సమాధానమని ఆయన తెలిపారు. గత దశాబ్ద కాలంలో భారత్ మారిన వ్యూహాన్ని ప్రస్తావిస్తూ బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్స్ నుండి 'ఆపరేషన్ సిందూర్' వరకు భారత్ పదేపదే ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందన్నారు. ఉగ్రవాదులు భారత్‌పై కన్నేస్తే వారికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు.

### ముంబై 26/11 దాడిపై ఏమన్నారంటే..

దేశంలో పాత రోజులను ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. 'ఒకప్పుడు భారత్‌లో వరుస బాంబు పేలుళ్లు జరగడం చాలా సాధారణం మారిపోయింది. ఈ సెప్టెంబర్ నెలలోనే, అంటే సెప్టెంబర్ 13, 2008న ఢిల్లీలో జరిగిన వరుస పేలుళ్లలో ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత కొద్ది వారాలకే ముంబైలో 26/11 ఉగ్రవాద దాడి జరిగిందని' అన్నారు. గతంలో ప్రతి ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వచ్చేవని, కానీ అలాంటివి చేయకుండా కాలం గడిచిపోయేలా చూసేవారని మోదీ అన్నారు. కానీ నేటి భారత్ ఉగ్రవాదంపై జీరో టాలరెన్స్ విధానంతో దూసుకెళ్తోందని, దీని ఫలితాలను కూడా మనం ప్రత్యక్షంగా చూస్తున్నామని పేర్కొన్నారు.

# రూ.30,491 కోట్ల దారి

కోలవెన్ను 83వ కి.మీ నుంచి మొదలై గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట సమీపంలోని 133.5వ కి.మీ. వరకు 50.5 కిలోమీటర్లు పొడవున మూడో ప్యాకేజీ ఉంటుంది. ఈ ప్యాకేజీలో అదనంగా నారాకోడూరు నుంచి బుడంపాడు వరకు 5.2 కి.మీ కనెక్ట్ రోడ్డు ఉంటుంది. మూడో ప్యాకేజీలో కృష్ణానదిపై వల్లూరుపాలెం దగ్గర 4.8 కిలోమీటర్ల మేర బ్రిడ్జి ఉంటుంది.

### ప్రాజెక్టు వ్యయం మొత్తం..

పుల్లడిగుంట దగ్గర 133.5 కిలోమీటర్ దగ్గర మొదలై ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల సమీపంలో 189వ కి.మీ. వరకు నాలుగో ప్యాకేజీ 55.5 కిలోమీటర్లు ఉంటుంది. ఈ ప్యాకేజీలో పేరేచర్ల వద్ద 400 మీటర్ల సొరంగం, మున్నలూరు దగ్గర కృష్ణానదిపై 3.15 కి.మీ. బ్రిడ్జి కూడా నిర్మిస్తారు. చివర్లో 189వ కిలోమీటర్ నుంచి 189.93 కిలీమీటర్ వరకు పనుల్ని కూడా మొదటి ప్యాకేజీలో చేర్చారు. వాస్తవానికి ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్ట్ మొత్తం అంచనా వ్యయం రూ.30,491 కోట్లు కాగా ఈ నాలుగు ప్యాకేజీల్లో రూ.10,595.70 కోట్లు సివిల్ పనులకు కలిపి అవసరమని అంచనా రూపొందించారు .భూసేకరణకు రూ.5,315 కోట్లు పర్యావరణ, అటవీ అనుమతులు, విద్యుత్ లైన్లు సహా ఖర్చులు, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్)లో 15 ఏళ్లపాటు వడ్డీ సహా చెల్లింపులకు మిగిలిన వ్యయం అవుతుంది.

# నాలుగేళ్లలో 111 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు పార్టీ మారారు!

(ఎన్ఈడబ్ల్యూ) సంస్థలు సంయుక్తంగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించాయి. 2022 నుంచి 2026 మధ్య కాలంలో చోటుచేసుకున్న ఈ రాజకీయ పరిణామాలపై జరిపిన విశ్లేషణలో ఆందోళనకరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి.ఏడీఆర్ నివేదిక ప్రకారం, పార్టీలు మారిన వారిలో 26 మంది లోక్‌సభ ఎంపీలు, 7 మంది రాజ్యసభ ఎంపీలు, 78 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. దేశంలోని 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ ఫిరాయింపులు చోటుచేసుకున్నాయి. అత్యధికంగా నాగాలాండ్‌లో 32 మంది, పశ్చిమ బెంగాల్‌లో 20 మంది, తెలంగాణలో 9 మంది, గోవా మరియు పంజాబ్‌లలో చెరో 8 మంది ప్రజాప్రతినిధులు తమ పార్టీలను వీడి ఇతర పార్టీలలో చేరారు. పార్టీల విలీనాలు, రాజీనామా చేసి ఇతర పార్టీ టికెట్‌పై గెలవడం, అనర్హత వేటు తర్వాత మరో పార్టీలో చేరి విజయం సాధించడం వంటి అన్ని కేసులను ఈ విశ్లేషణలో పరిగణనలోకి తీసుకున్నారు. అయితే, ఎన్నికల సంఘం నుంచి పూర్తిస్థాయి అధికారిక డేటా అందుబాటులో లేనందున ఈ జాబితా ఇంకా అసంపూర్ణంగానే ఉండవచ్చని ఏడీఆర్ పేర్కొంది.

### ఏ పార్టీలకు ఎక్కువ లాభం?

ఫిరాయింపుల వల్ల అత్యధికంగా లాభపడిన పార్టీలలో నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్) అగ్రస్థానంలో ఉంది. మొత్తం 32 మంది ప్రజాప్రతినిధులు ఈ పార్టీలో చేరారు. 2025లో నాగాలాండ్‌లో జరిగిన ఒక భారీ విలీనమే దీనికి కారణం. ముఖ్యమంత్రి నెయిఫియు రియో నేతృత్వంలోని ఎన్‌డీపీపీకి చెందిన 32 మంది ఎమ్మెల్యేలు ఎన్పీఎఫ్‌లో విలీనమయ్యారు. "నాగాల ఆకాంక్షల కోసం ఒకే బలమైన ప్రాంతీయ పార్టీ" నిర్మాణం కోసమే ఈ నిర్ణయమని రియో అప్పట్లో ప్రకటించారు. ఇక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 29 మంది నేతలను చేర్చుకుని రెండో స్థానంలో నిలిచింది. వీరిలో ఆప్‌కు చెందిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలు (స్వాతి మలివాల్, రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్ వంటి వారు) ఉండటం గమనార్హం. అలాగే గోవాలో 8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, గుజరాత్‌లో నలుగురు, మణిపూర్‌లో ఐదుగురు జేడీ(యూ) ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. అయితే, ఈ కాలంలో ఏ లోక్‌సభ ఎంపీ కూడా బీజేపీలో చేరకపోవడం గమనించాల్సిన విషయం.మరోవైపు, పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓటమి తర్వాత, ఆ పార్టీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు చేసి, అంతగా ప్రాబల్యం లేని నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్సిపిఐ)లో విలీనమై బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు మద్దతు పలికారు.

### నష్టపోయిన పార్టీలు, ఏడీఆర్ సిఫార్సులు

ఈ ఫిరాయింపుల వల్ల అత్యధికంగా నష్టపోయిన పార్టీలలో ఎన్‌డీపీపీ (25), తృణమూల్ కాంగ్రెస్ (20), కాంగ్రెస్ (19) ఉన్నాయి. మొత్తం ఫిరాయింపుల్లో 58% ఈ మూడు పార్టీల నుంచే జరగడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ పరిణామాలపై ఏడీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద ఉన్న ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేయాలని సూచించింది. అనర్హత వేటు వేసే అధికారాన్ని స్పీకర్‌కు బదులుగా, ఎన్నికల సంఘం సలహా మేరకు రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు అప్పగించాలని సిఫార్సు చేసింది. పార్టీ మారిన నేతలు ప్రజా పదవులు చేపట్టకుండా పరిమితులు విధించాలని, అనర్హత పిటిషన్లపై నిర్ణీత కాలపరిమితిలోగా నిర్ణయం తీసుకోవాలని కోరింది. "సౌలభ్యం, స్వప్రయోజనాల కోసం సాగే రాజకీయాలను" విమర్శిస్తూ, నేతలు "విశ్వాసం, ధైర్యం, ఏకాభిప్రాయ రాజకీయాల" వైపు అడుగులు వేయాలని ఏడీఆర్ పిలుపునిచ్చింది.

# ఏఐ ఏజెంట్ల శిక్షణ నిలిపివేత

పరిధిని దాటి, పబ్లిక్ ఇంటర్నెట్‌లోని ఒక చాట్‌బాట్ సర్వీస్‌ను యాక్సెస్ చేసింది.ఈ ఘటన తమ భద్రతా నియంత్రణ వ్యవస్థలోని బలహీనతను బయటపెట్టిందని ఓపెన్‌ఏఐ అంగీకరించింది. "మా ఏఐ మోడల్ లైవ్ ఇంటర్నెట్‌ను యాక్సెస్ చేయలేదనే నమ్మకంతో భద్రతా చర్యలు చేపట్టాం. కానీ, ఈ ఘటన మా అంచనాలను తలకిందులు చేసింది.

అందుకే ప్రభావితమైన శిక్షణా కార్యక్రమాన్ని వెంటనే ఆపివేశాం. భద్రతా లోపాన్ని పూర్తిగా పరిష్కరించి, అదనపు రెడ్-టీమింగ్ (హ్యాకింగ్ పరీక్షలు), భద్రతా పరీక్షలు పూర్తి చేసే వరకు మా అత్యంత సామర్థ్యం గల మోడళ్ల శిక్షణ, మూల్యాంకనం, టూల్-యూసేజ్‌ను నిలిపివేయాలని నిర్ణయించాం" అని నివేదికలో వివరించింది. ఒక బ్లాగ్ పోస్టులో ఉన్న సమాచారం ఆధారంగా ఒక వ్యక్తి వివరాలను కనుగొనడమే ఈ ఏఐకి ఇచ్చిన టాస్క్. అందుకోసం అందించిన సెర్చ్ టూల్ సరైన ఫలితాలు ఇవ్వకపోవడంతో, ఆ ఏఐ ఏజెంట్ తన పరిమితులను అధిగమించే ప్రయత్నం చేసింది. ఇతర సెర్చ్ ఇంజిన్లను నేరుగా యాక్సెస్ చేసేందుకు సొంతంగా కోడ్ ఉపయోగించింది. ఆ ప్రయత్నం విఫలమవడంతో, ఈ టాస్క్ 'బ్రౌజ్‌కాంప్' అనే బెంచ్‌మార్క్‌కు సంబంధించినది కావచ్చని అది ఊహించింది. వెంటనే ఆఫ్‌లైన్ కాపీ నుంచి ఆ బెంచ్‌మార్క్ డేటాసెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దానిలోని ప్రశ్నల ద్వారా సమాధానాన్ని రాబట్టింది. ఈ అనూహ్య ప్రవర్తనను గుర్తించిన ఓపెన్‌ఏఐ, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండేందుకు కఠిన చర్యలు చేపట్టింది.

# ప్రపంచ టూరిజం డెస్టినేషన్‌గా తెలంగాణ

యాదాద్రి, భద్రాద్రి, అలంపూర్, మేడారం వంటి ఆధ్యాత్మిక, చారిత్రక ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌లోని వారసత్వ కట్టడాలను కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించినట్లు సీఎం రేవంత్ చెప్పారు. ఇప్పటికే ప్రసిద్ధి చెందిన ప్రాంతాలతో పాటు కొత్త పర్యాటక ప్రదేశాలను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మౌలిక సదుపాయాలు, పర్యాటకులకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలు, నాణ్యమైన సేవలను మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తన సందేశంలో వివరించారు. తెలంగాణ పర్యాటక రంగంలో పెట్టుబడులను పెంచేందుకు తెలంగాణ టూరిజం పాలసీ 2025-30 ద్వారా అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. కొత్త పర్యాటక ప్రాజెక్టులతో పాటు అడ్వెంచర్ టూరిజం, క్యారవాన్ పార్కులు, వే-సైడ్ అమినిటీస్, ఎకో టూరిజం వంటి విభాగాల్లో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు.ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం, మెడికల్ టూరిజంతో పాటు హెరిటేజ్ టూరిజానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పర్యాటక రంగంలో పెట్టుబడులు పెరగడం ద్వారా కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి రావడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పర్యాటక అభివృద్ధిని కేవలం కొత్త ప్రాంతాల నిర్మాణానికి పరిమితం చేయకుండా స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. పర్యాటక రంగంతో అనుబంధంగా పనిచేసే హోటళ్లు, ట్రావెల్ ఏజెన్సీలు, పర్యాటక సంస్థలు, కళాకారులు, హస్తకళాకారులు, స్థానిక యువత భాగస్వామ్యం కీలకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పర్యాటకుల రాక పెరిగితే స్థానిక ఉత్పత్తులు, హస్తకళలు, సంప్రదాయ కళలకు కూడా మార్కెట్ విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు.తెలంగాణలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసే క్రమంలో రాష్ట్ర వారసత్వాన్ని కాపాడటం, ప్రకృతిని పరిరక్షించడం, స్థానిక సంస్కృతికి గౌరవం ఇవ్వడం ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పర్యాటక అభివృద్ధి స్థిరమైన రీతిలో సాగేందుకు స్థానిక ప్రజలు, పర్యాటక రంగ సంస్థలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణకు వచ్చే ప్రతి పర్యాటకుడికి ఆత్మీయ స్వాగతం పలికి రాష్ట్ర ప్రత్యేకతలను ప్రపంచానికి చాటాలని ముఖ్యమంత్రి కోరారు. తెలంగాణను ప్రపంచ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన తన సందేశంలో పేర్కొన్నారు.

# యూఎల్‌సీ దరఖాస్తులకు మోక్షం

ఫలితంగా ప్రజలు తమ భూములపై హక్కులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ప్రజల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా సహచర క్యాబినెట్ మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### యూఎల్‌సీ పెండింగ్ దరఖాస్తులపై తాజా నిర్ణయం

తెలంగాణ పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం (యూఎల్‌సీ) కింద పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు గతంలో జారీ చేసిన జీవో నం.455, 456, 747, 92 కింద వచ్చిన పెండింగ్ యూఎల్‌సీ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించే విధంగా ఆదివారం నాడు మెమో.న్యూ.48062/యూఎల్‌సీ/ఏ1/2026-1 జారీ చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అర్హత కలిగిన కేసుల్లో నిబంధనల ప్రకారం అవసరమైన అన్ని ప్రక్రియలు పూర్తి చేసి క్రమబద్ధీకరణ చర్యలు తక్షణం చేపట్టాలని అధికారులను ఆదేశించడం జరిగిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

### 2016లో జీవో.. అమలు మాత్రం శూన్యం

యూఎల్‌సీ సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 2016లో జీవో జారీ చేసినప్పటికీ, ఆ జీవోను అమలు చేయకపోవడంతో ఏళ్ల తరబడి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

### 22ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం


ఈ నెల 16న శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్షన్ 22ఏతో ముడిపడి ఉన్న 10--12 కీలక అంశాలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరిస్తామని ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే 22ఏ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయడం, ఆ తర్వాత జి.ఓ 118కు అనుగుణంగా మెమో జారీ, ఆ వెంటనే జి .ఓ 76కు అనుగుణంగా మెమో ఇవ్వడం జరిగిందన్నారు. 22ఏ లో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ, డీటీసీపీ, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఉత్తరులు జారీ చేయడం జరిగిందన్నారు.తాజాగా దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న యూఎల్‌సీ దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చామన్నారు. మిగిలిన అన్ని సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

### ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

'దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని, వారికి ఇబ్బందులు కలిగిస్తున్న ప్రతి భూ సమస్యను పరిశీలించి, చట్టం, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రథమ లక్ష్యం' అని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

# కూటమి శ్రేణుల మధ్య సమన్వయమే విజయానికి కీలకం

### ఏ ఎన్నికలనైనా సమర్థవంతంగా ఎదుర్కోవాలి



ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేలా కూటమి శ్రేణులను సమాయత్తం చేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు టీడీపీ--జనసేన--బీజేపీ నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని పల్లా దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమన్వయ కమిటీలు చురుగ్గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అభివృద్ధి, స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలపై సమగ్ర అవగాహన కలిగి ఉన్న అత్యంత అనుకూలమైన అభ్యర్థులను గుర్తించాలని నిర్ణయించారు.

### కూటమి శ్రేణుల ఐక్యత, సమన్వయం అత్యవసరం

అలాగే క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలు, రాజకీయ పరిణామాలపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా కార్యాచరణను సవరించుకోవాలని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సూచించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకత్వం, క్షేత్రస్థాయి శ్రేణుల మధ్య నిరంతర సమన్వయం ఉండేలా చర్యలు చేపట్టాలని పల్లా పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శ్రేణుల ఐక్యత, సమన్వయం, సమష్టి కార్యాచరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో విశాఖపట్నం జిల్లా పార్లమెంట్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ఎం.ఏ. షరీఫ్, విశాఖపట్నం జిల్లా ఇన్‌చార్జి మంత్రి డా. డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అందరి లెక్కలు తేల్చుతాం

ప్రజల్లో నిరాశ, నిస్పృహలు పెరిగాయని అన్నారు. హైదరాబాద్‌లో పోలీస్ కమిషనర్ ప్రెస్‌మీట్ పెట్టి ఏ పాట పెట్టాలి.. ఏ పాట పెట్టొద్దు అని మాట్లాడుతున్నారు. శాంతి భద్రతలు పర్యవేక్షించాల్సిన పోలీసులు డీజేలు బంద్ చేయిస్తున్నరు. అణిచివేత ఎక్కువైతే సందర్భం వస్తే గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారుతాయి. అందుకే అదే సజ్జనర్, కిషన్ రెడ్డి ముందు దేక్ లెంగే అని పాటలు పెట్టుకొని డ్యాన్స్ చేశారని కేటీఆర్ అన్నారు. ప్యారడైజ్‌లో కేసీఆర్ పాత్ర ఉన్నది నాలుగు నిమిషాలు మాత్రమే, అయినా తమకు స్వేచ్ఛ స్వతంత్రం ఇచ్చిన నాయకుడిని ప్రజలు ఎలా గుర్తు చేసుకుంటుంది మనకు కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. సందర్భం వచ్చిన ప్రతిసారీ ప్రజలు కేసీఆర్ ను గుర్తు చేసుకుంటూనే ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు

కేసీఆర్ అధికారంలో ఉండి ఉంటే రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రో రైలు ఎప్పుడో వచ్చేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యవస్థ దెబ్బతిన్నదని పేర్కొన్నారు. కమీషన్ల పేరుతో వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రాయదుర్గం- శంషాబాద్ మెట్రో ప్రాజెక్టుకు టెండర్ ప్రక్రియ పూర్తిచేశాం, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ టెండర్‌ను రద్దు చేసిందని కేటీఆర్ అన్నారు. మోసం చేసి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని వ్యాఖ్యానించారు. ఎవరు ఎక్కడ ఏం చేస్తున్నారో తమకు తెలుసని, బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని లెక్కలు బయటకు తీస్తామని చెప్పుకొచ్చారు. రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ కార్తిక్ రెడ్డి పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నారని కేటీఆర్ ప్రశంసించారు. అర్హులైన పట్టభద్రులంతా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# ఆపదలో అండగా.. ఆపన్న హస్తం మిత్ర బృందం

### 131వ సహాయ కార్యక్రమంలో రూ.20 వేల ఆర్థిక సాయం




గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ ఆపన్న హస్తం మిత్ర బృందం తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా గజ్వేల్‌లో బుధవారం 131వ సహాయ కార్యక్రమాన్ని నిర్వహించారు.సిద్దిపేట జిల్లా సింగాటం గ్రామానికి చెందిన కీసరి బాలరాజు గౌడ్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతున్నారు. వైద్యుల సూచన మేరకు మూడు నెలలకు పైగా వైద్యం అవసరమని తెలియడంతో నిరుపేద కుటుంబానికి చికిత్స ఖర్చులు భారంగా మారాయి. భార్య, ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్న కుటుంబానికి ఆస్తిపాస్తులు లేకపోవడంతో ఆర్థిక సహాయం కోసం దాతలను ఆశ్రయించారు.ప్రస్తుతం గజ్వేల్‌లోని సన్‌రైజ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాలరాజు గౌడ్‌ను ఆపన్న హస్తం మిత్ర బృందం సభ్యులు పరామర్శించి, తమ వంతు సహాయంగా రూ.20,000 నగదు అందించారు. బృందం సేవా కార్యక్రమానికి స్పందించిన డాక్టర్ సుదర్శన్ అదనంగా రూ.3,000 ఆర్థిక సహాయం అందించారు.ఆపదలో ఉన్న కుటుంబాలకు తమవంతుగా సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవడమే తమ లక్ష్యమని బృందం సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆపన్న హస్తం మిత్ర బృందం అధ్యక్షుడు పాషికంటి బాలచంద్రం, ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోశాధికారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు కొలిచెల్మ స్వామి, సభ్యులు రాణి, జ్యోతి, కనకరాజు, కిష్టయ్య, మహేష్, శ్రీకాంత్, సుదర్శన్, సన్‌రైజ్ హాస్పిటల్ యాజమాన్యం, డాక్టర్ నాగేందర్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# విమర్శకుల నోళ్లు మూయించేలా అభివృద్ధి

- నెల్లూరుకు రూ.3,500 కోట్లతో పనులు.. రూ.60 కోట్లతో ఆధునిక మార్కెట్
- వచ్చే ఏడాది జూన్‌లోగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలు పూర్తి
- నగరాన్ని గ్రీన్ సిటీగా దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతాం : మంత్రి నారాయణ



నెల్లూరు(ప్రశ్న న్యూస్) నెల్లూరు నగరాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నగరంలో రూ.3,500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. విమర్శకుల నోళ్లు మూసేలా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.4వ డివిజన్ కృష్ణవేణి స్కూల్ వీధిలో రూ.16 లక్షలతో, 7వ డివిజన్ వైవీఎం ఎలిమెంటరీ స్కూల్ సమీపంలో రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం 9వ డివిజన్ నవాపేటలో రూ.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆధునిక మార్కెట్‌కు శంకుస్థాపన చేశారు.

### గ్రీన్ సిటీగా నెల్లూరు

2028 జూన్ 12 నాటికి నెల్లూరు నగరాన్ని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. వచ్చే ఏడాది జూన్ 12లోగా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి పథకాలను పూర్తి చేస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తికాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయని, ప్రస్తుతం వాటిని తిరిగి తీసుకొచ్చి అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని వివరించారు.నగరాన్ని దోమల రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, కార్పొరేషన్ ఈఈ అనీల్‌కుమార్, డీఈ శ్రీనివాసరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, డివిజన్ టీడీపీ నేతలు బాలాజీ, రాజశేఖర్, వ్యాపార సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గువహటిలో సీజేపీ లీడర్ల అరెస్టు..
## సీఎం భయపడ్డారంటూ సీజేపీ విమర్శ



అసోం రాజధాని గువహటిలో సీజేపీ నేతలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సీజేపీ కో ఫౌండర్ అశుతోష్ రాంకా సహా పలువురు సీజేపీ నేతల్ని పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. అసోంలో పాఠశాలల పరిస్థితిని గురించి అంచనా వేసేందుకు అధ్యయన బాట పట్టారు. అసోంలోని విద్యాలయాల్ని పరిశీలించడం, అక్కడి వాస్తవ పరిస్థితుల్ని బయటపెట్టడం, కజిరంగ అభయారణ్యం పరిస్థితి, అడవులు, కృత్రిమ వరదలు వంటి పరిస్థితుల్ని అసోం ప్రజలకు, ఇండియాకు వివరించాలని తాము పర్యటన చేపట్టినట్లు సీజేపీ నేతలు అన్నారు. అయితే, తమను అడ్డుకోవడం ద్వారా అసోం సీఎం హిమంత బిశ్వశర్మ తమకు భయపడ్డారని సీజేపీ నేతలు ఆరోపించారు. రాష్ట్రంలోని భూముల్ని, అడవుల్ని, నీటిని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని అశుతోష్ రాంకా విమర్శించారు. రాంకా సహా సీజేపీ నేతల్ని అదుపు చేయడంపై సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అశుతోష్ రాంకా సహా సీజేపీ నేతల్ని అసోం పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వారిని రహస్య ప్రదేశంలోకి తీసుకెళ్లారని దీప్కే పోస్టులో పేర్కొన్నారు.

## కారుపై వేలాడుతూ 40 కిలోమీటర్ల చేజింగ్..
## సినీ స్టైల్‌లో గుట్కా స్మగ్లర్‌ను అరెస్టు చేసిన పోలీస్



పోలీసులు అంటే ధైర్య సాహసాలకు పెట్టింది పేరు. నేరాన్ని ఆపడానికి, నేరస్తుల్ని అడ్డుకోవడానికి కొందరు పోలీసులు ప్రాణాలు సైతం లెక్కచేయరు. అలా, ప్రాణాలకు తెగించి, క్రిమినల్‌ను పట్టుకున్న పోలీస్ వీరోచిత ఘటన ఇది. ఒక పోలీసు నిందితుడి కార్ రూఫ్ టాప్‌పై వేలాడుతూ 40 కిలోమీటర్లు ఉన్నాడు. అలా, చివరికి నిందితుడిని పట్టుకున్నాడు. ఈ ఘటన తమిళనాడులో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి.తమిళనాడు, కోయంబత్తూర్ సమీపంలోని కోవిల్‌పాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారిపై పోలీసులు సాధారణ వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కారు అనుమానాస్పదంగా కనిపించింది. కారును మొత్తం తనిఖీ చేస్తుండగా కొన్ని నిషేధిత గుట్కా ప్యాకెట్లు కనిపించాయి. దీంతో కారులోని వ్యక్తులు ఆ పోలీసుల్ని తోసేశారు. వేగంగా కారుతో సహా వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో హెడ్ కానిస్టేబుల్ వేలుమురుగన్ చెయ్యి కారు డోర్‌లో ఇరుక్కుపోయింది. కారు వేగంగా బయల్దేరడంతో అప్రమత్తమైన వేలుమురుగన్ వెంటనే కారు రూఫ్ టాప్‌పైకి ఎక్కేశాడు.అతడు కారు పైన ఉండగానే ఆ కారు ఆపకుండా, వేగంగా దూసుకెళ్లింది. అలా, వేలు మురుగన్ కారుపైనే ఉండిపోగా.. ఆ కారు దాదాపు 40 కిలోమీటర్లు ప్రయాణించింది. వెంటనే మిగతా పోలీసులు, ఇతర వాహనదారులు ఆ కారును వెంబడించినా ఆగకుండా దూసుకెళ్లారు నిందితులు. ఇలా వెళ్తూ ఒక టోల్ ప్లాజాను కూడా దాటేశారు. అక్కడ ఫాస్టాగ్ కూడా చెల్లించి, వేగంగా వెళ్లిపోయారు. అయితే, సమీపంలోని పోలీసులు, ఇతరులు అలర్ట్ కావడం.. వారంతా కారును చుట్టుముట్టడంతో 40 కిలోమీటర్ల తర్వాత కారును నిందితులు ఆపాల్సి వచ్చింది. ఈ లోపు పోలీసులు అంబులెన్సులను కూడా సిద్ధంగా ఉంచారు.చుట్టుముట్టిన కార్లు, వాహనాల వల్ల తప్పించుకోలేమని అర్థమైన నిందితులు కారును ఆపేశారు. మొత్తం ముగ్గురు నిందితుల్లో ఒకరిని పోలీసులు అక్కడే పట్టుకున్నారు. మరో ఇద్దరు పారిపోగా.. కొంత సమయం వారి కోసం గాలించి, వారిని కూడా అరెస్టు చేశారు. మొత్తం ముగ్గురు నిందితుల్ని అరెస్టు చేశారు. వారి నుంచి 300 కేజీల నిషేధిత గుట్కాతోపాటు కారును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ధైర్య సాహసాలు ప్రదర్శించిన హెడ్ కానిస్టేబుల్ వేలు మురుగన్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## మేడారం మినీ జాతర తేదీలను
## ప్రకటించిన పూజారులు



ములుగు : తెలంగాణ కుంభమేళగా ప్రసిద్ధిగాంచిన ములుగు జిల్లా సమ్మక్క -సారక్క తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో 2027 ఫిబ్రవరి మాసంలో నిర్వహించే మేడారం మినీ జాతర తేదీలను పూజారులు. ప్రకటించారు. 2027 ఫిబ్రవరి 17 వ తేది బుధవారం నుండి 20వ తేదీ శనివారం వరకు నాలుగు రోజులపాటు మినీ జాతర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కాగా, మేడారంలో ఆదివాసీ గిరిజన దైవాలు సమ్మక్క-సారలమ్మల మహాజాతరను ఆదివాసీ గిరిజన సంప్రదాయం ప్రకారం నిర్వహించడం ఆనవాతీగా వస్తోంది.

## యాదగిరిగుట్టకు పోటెత్తిన భక్తులు




యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. వారాంతాలు, సెలవు దినాల్లో భారీ సంఖ్యలో భక్తులు  తరలివస్తుండటంతో, క్యూలైన్లు, వ్రత మండపాలు, కొండపైన పరిసరాలు నిండిపోయాయి. ధర్మ దర్శనానికి 3 గంటల గంట సమయం పడుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ఎల్‌పీ యూనివర్సిటీలో విద్యార్థినిపై
## అత్యాచారం అంటూ పుకార్లు.. విద్యార్థుల ఆందోళన



పంజాబ్, ఫగ్వారాలో ఉన్న లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ (ఎల్‌పీయూ)లో విద్యార్థినిపై అత్యాచారం జరిగిందంటూ ప్రచారం ఊపందుకుంది. దీంతో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఈ ఆందోళ పోలీసులకు, విద్యార్థులకు మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసింది. శనివారం రాత్రి యూనివర్సిటీ క్యాంపస్ పరిధిలో ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించిన వివరాల్ని ఎస్ఎస్పీ గౌరవ్ తూరా వెల్లడించారు. యూనివర్సిటీలో ప్రచారం జరుగుతున్నట్లు విద్యార్థినిపై ఎలాంటి అత్యాచారం జరగలేదన్నారు.ఈ అంశంపై తమకు ఎలాంటి ఫర్యాదు అందలేదని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని, వదంతుల్ని నమ్మి విద్యార్థులు ఆందోళనకు దిగారని తెలిపారు. విద్యార్థులు ఆందోళనకు దిగిన విషయం తెలుసుకుని తాము ఇక్కడికి వచ్చామని, ఈ ఘటనపై తమకు ఎలాంటి సమాచారం లేదని పోలీసులు అన్నారు. ఎలాంటి ఫిర్యాదు కూడా అందలేదన్నారు. ఈ అంశంపై విద్యార్థి సంఘాల నేతలతో మాట్లాడామని, దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామన్నారు.విద్యార్థులు కొన్ని అంశాలపై ఫిర్యాదు చేశారని, అయితే, వారిలో స్పష్టత లేదన్నారు. వాళ్లకు కొన్ని అనుమానాలున్నాయని, వాటిని నివృత్తి చేస్తామన్నారు. అసలు ఈ సోషల్ మీడియా పోస్టు ఎవరు చేశారు.. ఎక్కడ్నుంచి, ఎలా మొదలైంది అనే అంశాలపై విచారణ జరుపుతున్నామని ఎస్ఎస్పీ గౌరవ్ తెలిపారు. తమ యూనివవర్సిటీ విద్యార్థినిపై అత్యాచారం జరిగిందన్న వదంతుల నేపథ్యంలో విద్యార్థినీ, విద్యార్థులు శనివారం రాత్రి భారీ స్థాయిలో ఆందోళనకు దిగారు. క్యాంపస్‌లోని పూల కుండీలు, ఇతర ఆస్తుల్ని ధ్వంసం చేశారు. కొన్ని చోట్ల నిప్పు పెట్టినట్లు తెలుస్తోంది.అలాగే, జలంధర్-ఫగ్వారా హైవేను కూడా విద్యార్థులు దిగ్బంధించి, నిరసన చేపట్టారు. అర్ధరాత్రి 2.00 గంటల నుంచి ఈ నిరసన భారీ స్థాయిలో కొనసాగింది. దీన్ని అడ్డుకునేందుకు వెళ్లిన పోలీసులపై విద్యార్థులు ఘర్షణకు దిగారు. దీంతో పరిస్తితి మరింత ఉద్రిక్తంగా మారింది. మరోవైపు.. యూనివర్సిటీ యాజమాన్యం కూడా ఈ ప్రచారాన్ని ఖండించింది. ఆదివారం కూడా విద్యార్థుల ఆందోళన కొనసాగుతోంది.

## నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య



నల్లగొండ : నల్లగొండ పట్టణంలోని మీర్ బాగ్ కాలనీ లోని షా రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో దారుణ ఘటన జరిగింది. అపార్ట్‌మెంట్ నాలుగో ఫ్లోర్‌లోని 402 రూమ్‌లో ఇద్దరూ వ్యక్తుల మధ్య శనివారం రాత్రి జరిగిన గొడవ హత్యకు దారి తీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన కూలీల మధ్య గొడవ జరిగినట్లు తెలిసింది. వీరు నల్లగొండలో త్వరలో ప్రారంభం కానున్న చెన్నై షాపింగ్ మాల్ భవనంలో ఇంటీరియర్ వర్క్ కోసం తమిళనాడు నుంచీ వచ్చినట్లు సమాచారం. వీరు పగలు అక్కడ పని చేస్తూ రాత్రి బస కోసం అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నట్లు తెలిసింది.రాత్రి కూడా యధావిధిగా పని నుంచి వచ్చాక కూలీ డబ్బుల విషయంలో మాటామాటా పెరిగి ఘర్షణగా మారినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. విషయం తెల్సిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ శివరామరెడ్డి నేతృత్వంలోని టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహన్ని పోస్ట్ మార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆదివారం అయినా..
## బ్యాంకులు తెరుచుకున్నాయ్!



కారేపల్లి,సెప్టెంబర్ 27 : సాధారణంగా ఆదివారం బ్యాంకులకు సెలవు ఉన్నప్పటికీ.. సెప్టెంబర్ 27న పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రత్యేకంగా తెరుచుకున్నాయి. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల పాటు బ్యాంకు సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఖాతాదారులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా (ఆదివారం) నేడు బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంచారు.

దీంతో ఆదివారం కూడా బ్యాంకు శాఖల వద్ద ఖాతాదారుల సందడి కనిపించింది. నగదు జమ, నగదు ఉపసంహరణ, చెక్కులు, ఖాతాలకు సంబంధించిన ఇతర సాధారణ సేవలను వినియోగించుకునేందుకు పలువురు ఖాతాదారులు బ్యాంకులకు వచ్చారు.

సాధారణ సెలవు రోజున బ్యాంకులు పనిచేయడంతో అత్యవసర లావాదేవీలు ఉన్న వారికి కొంతమేర ఊరట లభించింది. మరోవైపు మూడు రోజుల సమ్మె కారణంగా సోమవారం నుంచి బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉండటంతో ఖాతాదారులు ముందుగానే అవసరమైన లావాదేవీలు పూర్తి చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే ఏ శాఖలో ఏయే సేవలు అందుబాటులో ఉంటాయన్నది బ్యాంకు, శాఖను బట్టి మారవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

## కేసీఆర్‌పై నాగిరెడ్డిపల్లి యువకుడి వెరైటీ అభిమానం




ఊట్కూర్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్  పేరును యువకుడు పచ్చబొట్టు వేయించుకున్నాడు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన రమేశ్.. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతోనే కుడి చేతిపై టాటూ వేయించుకున్నాడు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద వంద శాతం సబ్సిడీతో ట్రాక్టర్ తీసుకున్నామన్నారు.ప్రస్తుతం అదే తమ కుటుంబ జీవనోపాధికి ఉపయోగపడుతోందని తెలిపారు. దీంతో మణికట్టుపై కనిపిస్తున్న 'కేసీఆర్' టాటూ.. రమేశ్ కుటుంబానికి అందిన ట్రాక్టర్ సాయం స్థానికంగా చర్చనీయాంశంగా మరింది.

## 'నయగార'ను తలపిస్తున్న 'బొగత'..
## జలపాతం వద్ద పర్యాటకుల కోలాహలం



వాజేడు, సెప్టెంబర్, 26: ములుగు జిల్లా వాజేడు మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం జలకళతో ఆకట్టుకుంటున్నది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతంలోకి ఎగువ ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వరదలొస్తున్నాయి.జలపాతం వద్ద 50 అడుగులపై నుంచి వర్షపు నీరు జాలువారుతూ పాలనురగను తలపిస్తున్నది. ఈ నేపథ్యంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన పర్యాటకులు జలపాతాన్ని సందర్శించారు. సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

## పెన్షన్ కోసం వెళ్లి వస్తూ వాగులో వృద్ధుడి గల్లంతు..
## అచూకీ కోసం పోలీసుల గాలింపు



టేకుమట్ల : పెన్షన్ డబ్బుల కోసం వెళ్లిన వృద్ధుడు తిరిగి వస్తూ వాగులో గల్లంతైన ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం ద్వారకాపేటలో శనివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ద్వారకాపేటకు చెందిన చిటికెల రవీందర్‌రెడ్డి(65) పింఛన్ డబ్బుల కోసం స్థానికులతో కలిసి శనివారం సమీపంలోని చలివాగు దాటి ఎంపేడు గ్రామానికి వెళ్లాడు. పెన్షన్ డబ్బులు తీసుకున్న అనంతరం తిరిగి ద్వారకపేటకు వస్తుండగా చలివాగు దాటే క్రమంలో తన తోటి వారిని వదిలి నేను వెనక వస్తా .. మీరు పదండి .. అనడంతో వారు వాగు దాటారు. రవీందర్‌రెడ్డి వాగు దాటుతున్న క్రమంలో వరద ప్రవాహం పెరగడంతో నీటిలో పడి గల్లంతయ్యాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రెస్క్యూ టీమ్‌తో గాలింపు చేపట్టినా సాయంత్రం వరకూ రవీందర్‌రెడ్డి ఆచూకీ లభించలేదు.

## మివీ వన్ 5జీ ఫోన్ విడుదల..
## ధర బడ్జెట్‌లోనే.. కీలక ఫీచర్లివి



ఇంతకాలం మొబైల్ ఫోన్ యాక్సెసరీస్‌కు, ఇతర డిజిటల్ ప్రోడక్ట్‌లకే పరిమితమైన మివీ సంస్థ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సంస్థ తొలిసారిగా మివీ వన్ 5జీ అనే ఫోన్‌ను లాంఛ్ చేసింది. బ్లూ, బర్గాండి, డార్క్ బ్లూ, గ్రీన్, పింక్ అనే ఐదు కలర్స్‌లో లభిస్తోంది. ఎంట్రీ లెవెల్‌లో, బడ్జెట్ ధరలో మంచి ఫోన్ కావాలనుకునే వారికి ఇదొక ఆప్షన్.స్నాప్‌డ్రాగన్ ప్రాసెసర్, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ప్రత్యేకతలున్నాయి. ఈ ఫోన్ సర్వీసింగ్ కోసం మివీ కేర్ ం అనే సదుపాయం కల్పిస్తోంది. అంటే, వినియోగదారులు ఇంటి నుంచే మివీ మొబైల్ సర్వీస్ పొందవచ్చు. ఫోన్‌లో సమస్య వస్తే కంపెనీ సిబ్బంది పికప్ చేసుకుని, రిపేర్ చేసి, డెలివరీ చేస్తామని కంపెనీ చెబుతోంది. అలాగే, వారం రోజుల్లోగా రిపేర్ కాకుండా కొత్త ఫోన్ అందిస్తామని కూడా ప్రకటించింది. అలాగే, ప్రారంభ ఆఫర్ల కింద ఫోన్‌ను తక్కువ ధరలోనే పొందే వీలుంది. వివిధ కార్డులపై డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ వంటి ఆఫర్లున్నాయి. ఈ ఫోన్‌కు సంబంధించిన కీలక ఫీచర్లివి.6.75 అంగుళాల హెచ్‌డీం ఐపీఎస్ ఎల్‌సీడీ డిస్‌ప్లే, 120 హెర్జ్ రిఫ్రెష్‌రేట్, క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 4 జెన్ ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 16, రెండేళ్లపాటు ఓఎస్ అప్‌డేట్స్, శాంసంగ్ ఐసోసెల్ 50 ఎంపీ మెయిన్ కెమెరా, 8 ఎంపీ సెల్ఫీ కెమెరా, 6,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 18 వాట్స్ ఫాస్ట్ ఛార్జింగ్, అడాప్టర్ ఇన్ బాక్స్, 4జీబీం128జీబీ, 6జీబీం128జీబీ, 8జీబీం128జీబీ వంటి ఫీచర్లున్నాయి. ధరలు వరుసగా రూ.11,999, రూ.13,4999, రూ.14,999.

# గుంటూరు కోసం ఒక్క వీడియో చేయండి

**ప్రతి ఇన్ఫ్లుయెన్సర్ ప్రజా చైతన్యానికి కృషి చేయాలి**

**సమస్యలపై విమర్శలు కాదు..**

**పరిష్కార మార్గాలు చూపాలి**

**మూడు నెలల్లో సాధ్యమైన సమస్యల పరిష్కారానికి చర్యలు**

**సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ఎమ్మెల్యే గల్లా మాధవి ముఖాముఖి**





గుంటూరు(ప్రశ్న న్యూస్) నగర అభివృద్ధి, ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పిలుపునిచ్చారు. ప్రతి ఇన్ఫ్లుయెన్సర్ తన కంటెంట్లో కనీసం ఒక వీడియోను గుంటూరు నగర ప్రయోజనాల కోసం రూపొందించాలని కోరారు. శనివారం తన నివాసంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లతో ఎమ్మెల్యే ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజల్లో చైతన్యం పెంచాల్సిన అంశాలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

## ప్రజా చైతన్యంలో కీలక పాత్ర

దేశంలోని కొన్ని ప్రాంతాలు పరిశుభ్రంగా, క్రమబద్ధంగా ఉండటానికి ప్రభుత్వ చర్యలతో పాటు ప్రజల్లో అవగాహన కూడా ప్రధాన కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గుంటూరులోనూ ప్రజల్లో బాధ్యతను పెంచేందుకు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు కీలక పాత్ర పోషించగలరని అన్నారు.
ప్రజా చైతన్యం అవసరమైన ప్రతి అంశంపై అవగాహన కల్పించే బాధ్యతను ఇన్ఫ్లుయెన్సర్లు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలకు చేరువైన వారు సామాజిక బాధ్యతలో భాగంగా నగర ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు.

## విమర్శలు వద్దు.. పరిష్కారాలు చూపండి

వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం కంటే.. ప్రజా సమస్యలకు పరిష్కార మార్గాలు సూచించేలా వీడియోలు రూపొందించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజల్లో సానుకూల మార్పు తీసుకువచ్చేలా కంటెంట్ ఉండాలని సూచించారు.

## మూడు నెలల్లో పరిష్కారానికి కృషి

ఇన్ఫ్లుయెన్సర్లు సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపై ఎమ్మెల్యే స్పందించారు. సాధ్యమైన సమస్యలకు కాలపరిమితితో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీలైన అంశాలను వచ్చే మూడు నెలల్లో పరిష్కరించే దిశగా కృషి చేస్తానని చెప్పారు. మరో మూడు నెలల తర్వాత మళ్లీ ఇన్ఫ్లుయెన్సర్లతో సమావేశమై చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కారంపై సమీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు.

## యువత.. చిన్నారులపై ప్రత్యేక దృష్టి

యువతకు దిశానిర్దేశం చేసే కార్యక్రమాలు, చిన్నారుల అభివృద్ధికి సంబంధించిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాల రూపకల్పనలో ఇన్ఫ్లుయెన్సర్ల సహకారం అవసరమని ఎమ్మెల్యే అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు.
గుంటూరు అభివృద్ధి.. ప్రజల్లో చైతన్యం అనే లక్ష్యంతో ప్రజాప్రతినిధులు, అధికారులు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గల్లా మాధవి పిలుపునిచ్చారు.

# వరదను ముందే పసిగట్టారు

**జంఝావతి ఉగ్రరూపం.. ముందస్తు చర్యలతో ముప్పు తప్పింది**

**రబ్బర్ డ్యామ్ చరిత్రలో గరిష్ఠంగా 22,124 క్యూసెక్కుల ప్రవాహం**

**అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన : మంత్రి సంధ్యారాణి**

**రాత్రింబవళ్లు పర్యవేక్షణ.. సమన్వయంతో సురక్షితంగా వరద నీటి విడుదల**





పార్వతీపురం(ప్రశ్న న్యూస్) ఒకవైపు కుండపోత వర్షాలు.. మరోవైపు ఉప్పొంగిన జంఝావతి. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో పార్వతీపురం మన్యం జిల్లాలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. అయితే ముందస్తు అంచనాలతో అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం, జలవనరుల శాఖ చేపట్టిన చర్యలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణతో పరిస్థితిని నియంత్రించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 24, 25 తేదీల్లో భారీ వర్షాలు కురవడంతో ఎగువ క్యాచ్మెంట్ ప్రాంతాలైన నారాయణపట్నం, బంధుగావ్లలో భారీ వర్షపాతం నమోదైంది. ఫలితంగా జంఝావతితో పాటు పలు వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగింది. జిల్లాలో భారీ వర్షాల కారణంగా రహదారులకు గండ్లు పడటం, రాకపోకలకు అంతరాయం వంటి పరిస్థితులు కూడా చోటుచేసుకున్నాయి.

## ముందే అప్రమత్తం

పరిస్థితి తీవ్రతను అంచనా వేసిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులతో వరుసగా టెలీకాన్ఫరెన్స్, జూమ్ సమావేశాలు నిర్వహించి ముందస్తు చర్యలపై దిశానిర్దేశం చేసినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ, జలవనరులు, పోలీసు, పంచాయతీరాజ్, విద్యుత్ తదితర శాఖలు సమన్వయంతో పనిచేసేలా ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ప్రమాదకర ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని సూచించినట్లు తెలిపారు.

## రబ్బర్ డ్యామ్ వద్ద కీలక చర్యలు

వరద ప్రవాహం పెరగకముందే జలవనరుల శాఖ అధికారులు జంఝావతి రబ్బర్ డ్యామ్ను పూర్తిగా డెఫ్లేట్ చేయడంతో పాటు లింక్ కెనాల్ డైవర్షన్లను మూసివేసినట్లు వెల్లడించారు.
దీంతో భారీగా వచ్చిన వరద నీరు డ్యామ్ నిర్మాణానికి, పరిసర ప్రాంతాలకు నష్టం కలగకుండా దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం వరద ప్రవాహం 22,124 క్యూసెక్కుల స్థాయికి చేరినట్లు పేర్కొన్నారు.

## చెరువులకు నీటి మళ్లింపు

పలు వాగుల నుంచి వస్తున్న వరద నీటిని సమర్థవంతంగా మళ్లించి జిల్లాలోని 33 ఆయకట్టు చెరువుల్లోకి నీరు చేరేలా చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. దీంతో పంట పొలాల్లోకి వరద నీరు చేరకుండా చూడటంతో పాటు భవిష్యత్ సాగునీటి అవసరాలకు నీటి నిల్వలను పెంచే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు.

## రాత్రింబవళ్లు పర్యవేక్షణ

భారీ వర్షాలు, చీకటి పరిస్థితుల్లోనూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించారు. కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్, జూమ్ సమావేశాల ద్వారా శాఖల అధికారులతో నిరంతరం సమన్వయం చేసినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా ముందస్తు హెచ్చరికలు, జలవనరుల శాఖ చర్యలు, వివిధ శాఖల సమన్వయం, సాంకేతిక పర్యవేక్షణతో జంఝావతి వరద పరిస్థితిని ఎదుర్కొన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా అధికారిక వెబ్సైట్లోనూ పార్వతీపురం మన్యం జిల్లా పరిపాలన, కలెక్టర్ కార్యాలయ వివరాలు అందుబాటులో ఉన్నాయి.

# రెండు పర్మిషన్లు.. ఒకే భవనం, నిబంధనలకు తూట్లు

**- చట్టాలంటే అధికారులకు చుట్టాలా.?- అక్రమ నిర్మాణాలకు 'మూడు పువ్వులు.. ఆరు కాయలు**

**- "తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా అధికారుల డైలాగ్ ఇదేనా.?**


OFFICE OF THE GREATER HYDERABAD MUNICIPAL CORPORATION

BUILDING PERMIT ORDER AND WORK COMMENCEMENT LETTER

DETAILS OF PERMISSION SANCTIONED

మలక్ పేట్ (ప్రశ్న న్యూస్) చార్మినార్ జోన్ పరిధిలోని మూసారాంబాగ్ సర్కిల్--29 లో అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయన్న విమర్శలు స్థానికుల నుండి వ్యక్తమవుతున్నాయి. మూసారాంబాగ్లోని ఎస్బీఐ ఆఫీసర్స్ కాలనీలో ప్లాట్ నంబర్ 16-11-కు సంబంధించి ఒకే ప్లాట్లో రెండు వేర్వేరు బిల్డింగ్ పర్మిషన్లు తీసుకుని, వాటికి నిర్దేశించిన సెట్బ్యాక్ నిబంధనలను పాటించకుండా ఒకే భవనంగా నిర్మాణం చేపట్టినట్లు సోషల్ రిఫార్మర్ అండ్ విజిల్ బ్లోయర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా మంజూరైన అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తు నిర్మించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంత స్పష్టమైన ఆరోపణలతో అధికారుల దృష్టికి విషయం వెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు కనిపించకపోవడమే ఇప్పుడు తీవ్ర ప్రశ్నలకు తావిస్తోంది.

## రెండు పర్మిషన్లు.. ఒకే భవనం.. నిబంధనలు ఎక్కడ.?

సోషల్ రిఫార్మర్ అండ్ విజిల్ బ్లోయర్ సమర్పించిన ఫిర్యాదు ప్రకారం.. 2025 ఏప్రిల్ 17న రెండు వేర్వేరు బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్లు జారీ అయ్యాయి. ఉత్తర భాగానికి 000238/GHMC/00228/IABPC/2025 ఫైల్ నంబర్, దక్షిణ భాగానికి 000239/GHMC/00229/IABPC/2025 ఫైల్ నంబర్, అనుమతులు జారీ చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు అనుమతుల్లోనూ స్టిల్ట్ ఫర్ పార్కింగ్ ప్లస్ రెండు పై అంతస్తులకు అనుమతి ఉన్నట్లు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో రెండు అనుమతుల పరిధిని కలిపి ఒకే భవనంగా నిర్మాణం చేపట్టినట్లు, ప్రతి అనుమతికి వర్తించే సెట్బ్యాక్ నిబంధనలు పాటించలేదని ఫిర్యాదుదారు ఆరోపించారు.

## - ఫిర్యాదు ఇచ్చినా.. 'అయితే మాకేంటి.? అన్నట్టుగా

అక్రమ నిర్మాణంపై సోషల్ రిఫార్మర్ అండ్ విజిల్ బ్లోయర్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు




చేసి, అక్రమ నిర్మాణంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసినా అధికారులు అయితే మాకేంటి.? అన్నట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

## అక్రమ నిర్మాణాలకు 'మూడు పువ్వులు.. ఆరు కాయలు

జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఫిర్యాదులు అధికారుల దృష్టికి వెళ్తున్నాయి. అయిన చర్యలు మాత్రం కనిపించకపోతే అక్రమ నిర్మాణదారులకు మరింత ధైర్యం వచ్చే ప్రమాదం ఉంది. నిబంధనలు పాటించే వారికి ఒక విధానం, ఉల్లంఘనల ఆరోపణలు ఎదుర్కొంటున్న నిర్మాణాల విషయంలో మరో విధానం ఉంటే ప్రజల్లో చట్టంపై నమ్మకం దెబ్బతింటుంది. అక్రమ నిర్మాణాలు 'మూడు పువ్వులు.. ఆరు కాయలు' అన్న చందంగా వర్ధిల్లుతుంటే వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు ఏం చేస్తున్నారన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

## అక్రమ నిర్మాణదారుల వెనుక ఎవరున్నారు.?

ఒక నిర్మాణం ఒక్కరోజులో పూర్తికాదు. పునాదుల నుంచి అంతస్తుల వరకు నిర్మాణం కొనసాగుతున్న సమయంలో పర్యవేక్షించాల్సిన బాధ్యత టౌన్ప్లానింగ్ అధికారులపై ఉంటుంది. అయిన అనుమతులకు మించి నిర్మాణం జరిగిందన్న ఆరోపణలు వస్తే.. పర్యవేక్షణ వ్యవస్థ ఎక్కడ విఫలమైందో తేల్చాలి. అధికారులు గుర్తించలేదా.? గుర్తించినా చర్యలు తీసుకోలేదా.? చర్యలు తీసుకోకపోవడానికి



కారణమేంటి.? ఎవరి ఒత్తిడి అయినా ఉందా? లేక అధికారుల నిర్లక్ష్యమే కారణమా.? అన్నది నిష్పాక్షిక విచారణలో తేలాల్సి ఉంది. సోషల్ రిఫార్మర్ అండ్ విజిల్ బ్లోయర్ అధికారులకు ఫిర్యాదు చేసిన తర్వాత కూడా చర్యలు ఎందుకు కనిపించడంలేదో మాత్రం అధికారులు సమాధానం చెప్పాల్సిందే.

## ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్న అధికారులు

ఒకే ప్లాట్లో రెండు అనుమతులను వినియోగించి ఒకే భవనంగా నిర్మాణం చేపట్టడంతో దాని వల్ల నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి రావాల్సిన ఫీజులు, ఇతర ఆదాయాలపై భారీ గండి పడింది. రెండు అనుమతులు, మంజూరైన ప్లాన్లు, నిర్మాణ విస్తీర్ణం, సెట్బ్యాక్లు, పార్కింగ్, అంతస్తులు తదితర ఉల్లంఘనల ద్వారా ప్రజా ఆదాయానికి భారీ నష్టం జరుగుతోంది.

## అధికారులకు చట్టాలంటే చుట్టాలా.?

చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే ఫిర్యాదులను పట్టించుకోకుండా మౌనం వహిస్తే ప్రజల్లో అనుమానాలు మరింత బలపడతాయి. సాధారణ పౌరుడు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడితే వెంటనే చర్యలు తీసుకునే అధికారులు.. ఇక్కడ ఫిర్యాదు అందిన తర్వాత కూడా ఎందుకు స్పందించడం లేదన్నది ప్రశ్న. ప్రజలకు ఒక చట్టం.. అక్రమ నిర్మాణాలకు మరో చట్టమా? చట్టాలంటే అధికారులకు చుట్టాలా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం ఇవ్వాలి.

## తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా చివరికి అధికారుల డైలాగ్ ఇదేనా.?




ఫిర్యాదు అందింది.. నిర్మాణంపై ఆరోపణలు వచ్చాయి.. అనుమతులు ఉన్నాయి.. సెట్బ్యాక్ ఉల్లంఘనల ఆరోపణలు ఉన్నాయి.. అదనపు అంతస్తుపై ఫిర్యాదు ఉంది. అయినా చర్యలు కనిపించకపోతే చివరికి అధికారుల నుంచి వినిపించే సమాధానం "తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా" అన్నట్టుగా ఉంటుందా.? ఫిర్యాదు వచ్చిన తర్వాత కనీసం తనిఖీ చేయకపోవడం, తనిఖీ చేసినా వివరాలు వెల్లడించకపోవడం, ఉల్లంఘన ఉంటే చర్యలు తీసుకోకపోవడం.. ఇవన్నీ అధికారుల బాధ్యతారాహిత్యంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఫిర్యాదును తీవ్రంగా పరిగణించి తక్షణమే క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించాలి.

రెండు బిల్డింగ్ పర్మిషన్లు, మంజూరైన ప్లాన్లు, సెట్బ్యాక్లు, వాస్తవ నిర్మాణం, అదనపు అంతస్తు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి. ఉల్లంఘనలు నిజమని తేలితే నిర్మాణదారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఫిర్యాదు అందిన తర్వాత విధి నిర్వహణలో ఎవరి నుంచి నిర్లక్ష్యం జరిగిందన్నదీ పరిశీలించాలి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా మౌనం వహించే అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

లేకపోతే "మూడు పువ్వులు.. ఆరు కాయలు" అన్నట్టుగా అక్రమ నిర్మాణాలు పెరుగుతుంటే.. వాటిని అడ్డుకోవాల్సిన అధికారులు మాత్రం "తెలీదు.. గుర్తులేదు.. మర్చిపోయా"అంటూ తప్పించుకుంటున్నారన్న ప్రజల అనుమానాలకు మరింత బలం చేకూరుతుంది. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే మౌనంగా ఉంటే.. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట ఎలా పడుతుంది.? ఫిర్యాదు చేసిన సోషల్ రిఫార్మర్ అండ్ విజిల్ బ్లోయర్ ప్రశ్నలకు సమాధానం చెప్పేది ఎవరు.?

# మొండెం మిస్టరీకి తెర

**సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసిన ప్రియుడు.?**

**ముక్కలు చేసి కూలింగ్ కెనాల్లో పడేసినట్లు పోలీసుల నిర్ధారణ**

**48 గంటల్లో కేసు ఛేదన.. ఇద్దరు నిందితుల అరెస్ట్**



ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) ఎన్టీటీపీఎస్ కూలింగ్ వాటర్ కెనాల్లో మహిళా మొండెం లభ్యమైన కేసు మిస్టరీకి పోలీసులు 48 గంటల్లోనే తెరదించారు. సహజీవనం చేస్తున్న మహిళను హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలుగా చేసి కూలింగ్ కెనాల్లో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. కేసులో ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని ఇబ్రహీంపట్నం పోలీసులు అరెస్టు చేశారు.

## గొడవలే హత్యకు దారితీశాయా.?

పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కరి దుర్గ అలియాస్ కల్యాణి (29) అక్కడి ఓ హోటల్లో పనిచేసేది. ఆ సమయంలో విజయవాడ భవానీపురం హచ్బీ కాలనీ పార్క్ రోడ్డుకు చెందిన మటన్ దుకాణం యజమాని షేక్ షఫీ (46)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. అనంతరం ఇద్దరూ సహజీవనం చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరికి ఓ కుమారుడు జన్మించగా.. ఆ బాలుడిని షఫీ వేరొకరికి దత్తత ఇచ్చినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కొంతకాలంగా బాబును తిరిగి ఇవ్వాలని కల్యాణి కోరడం, డబ్బుల వ్యవహారంలో ఇద్దరి మధ్య వివాదాలు జరగడం హత్యకు దారితీసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఇంటికి పిలిచి.. హత్య చేసినట్లు

కల్యాణితో విభేదాల నేపథ్యంలో ఆమెను వదిలించుకోవాలని షఫీ పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. తన కుటుంబ సభ్యులను ఊరికి పంపించి, సెప్టెంబరు 17న కల్యాణిని భవానీపురంలోని తన ఇంటికి పిలిచినట్లు చెప్పారు. అక్కడ ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా.. కల్యాణిని గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలిందని పేర్కొన్నారు.

## మృతదేహాన్ని ముక్కలుగా చేసి..

హత్య అనంతరం ఆధారాలు లేకుండా చేసేందుకు మృతదేహాన్ని మటన్ దుకాణంలో ఉపయోగించే కత్తులతో ముక్కలు చేసినట్లు పోలీసులు తెలిపారు. మటన్ షాపులో పనిచేసే షేక్ అబ్దుల్లా అలియాస్ దుర్గారావు సహాయంతో శరీర భాగాలను వేర్వేరు బ్యాగుల్లో ఉంచి, ద్విచక్రవాహనంపై తీసుకెళ్లినట్లు వెల్లడించారు. గొల్లపూడి, ఇబ్రహీంపట్నం పరిధిలోని కూలింగ్ కెనాల్లో వాటిని పడేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. సెప్టెంబరు 18న కాలువలో మహిళా మొండెం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

## టాటూతో గుర్తింపు..

మొండెం లభించిన సమయంలో మృతురాలి వివరాలు తెలియకపోవడంతో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆమె చేతిపై ఉన్న నెమలి పింఛం టాటూ, ఒంటిపై ఉన్న వస్తువులను ఆధారంగా చేసుకుని ఫొటోలను సోషల్ మీడియా వేదికలపై ప్రచారం చేశారు. ఆ ఫొటోలను చూసిన కల్యాణి సోదరుడు పోలీసులను సంప్రదించడంతో మృతురాలి గుర్తింపు సాధ్యమైంది.

## సీసీ కెమెరాలు.. టోల్గేట్లే ఆధారం

మృతురాలి గుర్తింపు లభించిన అనంతరం



పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. వెస్ట్జోన్ ఏసీపీ ఎన్.ఎస్.వి.కె. దుర్గారావు, ఇబ్రహీంపట్నం ఇన్స్పెక్టర్ ఎ. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. సీసీ కెమెరాల దృశ్యాలు, టోల్గేట్ల వద్ద వాహనాల డేటాను పరిశీలించి అనుమానితుల కదలికలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఆధారాలను విశ్లేషించిన అనంతరం ప్రధాన నిందితుడు షఫీతో పాటు అతనికి సహకరించిన దుర్గారావును అదుపులోకి తీసుకున్నారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు. దర్యాప్తులో ఇబ్రహీంపట్నం సీఐ ఎ. సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ సింబల్..

## బహుజన పక్షపాతి కొండా లక్ష్మణ్ బాపూజీ

**గజ్వేల్‌లో ఘనంగా జయంతి వేడుకలు.. విగ్రహానికి నివాళు లర్పించిన ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, చైర్‌పర్సన్ చందన-రవీందర్**



గజ్వేల్( ప్రశ్న న్యూస్ ) స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త, బహుజన పక్షపాతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ప్రభుత్వ లాంఛనాలతో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ పార్లమెంట్ ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవ రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ గొప్ప మహనీయుడని, నిస్వార్థ నాయకుడిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్తగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి బాపూజీ ఒక స్ఫూర్తి ప్రతీక అని, బహుజనుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన పోరాటం ఆదర్శనీయమని పేర్కొన్నారు. బాపూజీ చూపిన సత్యం, అంకితభావం, నిస్వార్థ సేవ మార్గంలో నడవడమే ఆయనకు అందించే గొప్ప నివాళి అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వైస్‌చైర్‌పర్సన్ పద్మ, బూరుగుపల్లి ప్రతాప్ రెడ్డి, యువ నాయకులు సర్దార్ ఖాన్, నర్సింగ్ రావు, కౌన్సిలర్లు కాముని మురళి, రొట్టెల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లిబత్తుల దేవదాసు, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం, మార్కండేయ దేవాలయ అధ్యక్షుడు గడ్డమీద ఆంజనేయులు, పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు గాడిపల్లి శ్రీనివాస్, తలకొక్కుల దుర్గాప్రసాద్, దేవులపల్లి రాజారాం, అడ్వకేట్ తలకొక్కుల రాజు, కాళీ ప్రసాద్, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, గాడిపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు గాడిపల్లి అనూప్, పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు కోట కిషోర్, ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, సంయుక్త కార్యదర్శి పాషికంటి శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, ఉపాధ్యక్షులు షేర్ల నర్సింలు, రాచకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
పద్మశాలి సంఘం ప్రతినిధులు, చేనేత కార్మికులు, కుల పెద్దలు, యువత, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయంతి వేడుకలను విజయవంతం చేశారు.

# నిమజ్జనం పూర్తయింది.. 'ప్యారడైజ్' మొదలైంది!

- సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు
-'ది ప్యారడైజ్' చూసి కేటీఆర్ ఫిదా.. శంకరన్న పాత్రపై ప్రశంసల జల్లు
- తెలంగాణ మట్టి, యాస, భాష, సంస్కృతికి సినిమాలో పెద్దపీట
- నాని, శ్రీకాంత్ ఓదెల, ప్రియదర్శికి అభినందనల వెల్లువ



హైదరాబాద్ ( ప్రశ్న న్యూస్ )నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ది ప్యారడైజ్' చిత్రాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సుదర్శన్ థియేటర్‌లో వీక్షించారు. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ లీగల్ అడ్వైసర్లు, శ్రేణులతో కలిసి సినిమా చూసిన అనంతరం కేటీఆర్, ప్యారడైజ్ చిత్రంపై ప్రశంసల జల్లు కురిపించారు.

### - అణచివేతపై పోరాటం.. అస్తిత్వం కోసం ఆరాటం :

'ది ప్యారడైజ్'లో అణచివేతకు గురైన వర్గం తన అస్తిత్వం, గుర్తింపు కోసం చేసే పోరాటాన్ని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సమర్థంగా తెరకెక్కించారని కేటీఆర్ ప్రశంసించారు. "అస్తిత్వం కోసం ఆరాటం.. అణచివేతపై పోరాటం. సందర్భం వస్తే గడ్డిపోచలు కూడా గడ్డపారలుగా మారుతాయి" అనే భావనను సినిమా బలంగా ఆవిష్కరించిందని పేర్కొన్నారు.

### - శంకరన్న పాత్రపై ప్రత్యేక ప్రశంసలు

సినిమాలో ప్రియదర్శి పోషించిన ఎమ్మెల్యే శంకరన్న పాత్ర ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఆ పాత్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పోలి ఉందనే చర్చ నేపథ్యంలో కేటీఆర్ స్పందనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. శంకరన్న పాత్ర తెరపై కనిపించిన సన్నివేశానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

### - తెలంగాణ మట్టి.. యాస.. భాష.. సంస్కృతి'పై ప్రశంసలు :

తెలంగాణ నేల, భాష, యాస, సంస్కృతి, ప్రజల పోరాటాలను సినిమాలో ప్రతిబింబించిన తీరును కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సమాజంలోని అస్తిత్వ పోరాటాన్ని కథలో భాగంగా మలిచిన శ్రీకాంత్ ఓదెలను ప్రశంసించారు.

### - నాని.. ఓదెల.. ప్రియదర్శికి అభినందనలు

కథానాయకుడి పాత్రలో నాని జీవించారని కేటీఆర్ ప్రశంసించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెలకు హృదయపూర్వక అభినందనలు తెలిపిన ఆయన ప్రియదర్శికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. చిత్రబృందం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

### - నిమజ్జనం టూ ప్యారడైజ్ రాజకీయ చర్చ :



వినాయక నిమజ్జనం సందర్భంగా 'ది ప్యారడైజ్' ప్రీమియర్ విషయంలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పేరు వార్తల్లోకి వచ్చింది. నాని హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో అభిమానులతో కలిసి సినిమా చూసేందుకు అనుమతి కోరగా, నిమజ్జనం బందోబస్తు, భద్రతా కారణాలను అధికారులు పరిశీలించిన విషయం తెలిసిందే. ఇదే సమయంలో నిమజ్జన వేడుకల్లో కేసీఆర్, బీఆర్ఎస్‌కు సంబంధించిన పాటలు వినిపించడంపై కూడా రాజకీయ చర్చ జరిగింది.
కేటీఆర్ పోలీసుల తీరుపై ప్రశ్నల వర్షం కురుస్తోంది. 'ది ప్యారడైజ్'లో శంకరన్న పాత్ర, తెలంగాణ అస్తిత్వ పోరాటం, నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు-ఈ మూడు అంశాలు ప్రస్తుతం తెలంగాణలో చర్చనీయాంశంగా మారాయి.

# గుంటూరు అందాలకు కొత్త 'గుర్తు'

**'ఐ లవ్ గుంటూరు'.. 'మన గుంటూరు' బోర్డులు**

**8 ప్రాంతాల్లో ఏర్పాటు.. రాత్రివేళల్లో వెలుగులతో ప్రత్యేక ఆకర్షణ**

**'చిల్లీస్ సిటీ ఆఫ్ ఇండియా'గా పొన్నూరు రోడ్డులో స్వాగతం**




గుంటూరు(ప్రశ్న న్యూస్) నగర సుందరీకరణకు గుంటూరు నగరపాలక సంస్థ మరో అడుగు ముందుకేసింది. నగరానికి వచ్చే వారికి ఆహ్లాదకర స్వాగతం పలకడంతోపాటు.. గుంటూరుపై స్థానికుల్లో మరింత మమకారం, గర్వభావం పెంచేలా 'ఐ లవ్ గుంటూరు', 'మన గుంటూరు' పేర్లతో ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయనుంది. నగరంలోని ఎనిమిది ప్రధాన ప్రాంతాలను ఇందుకోసం ఎంపిక చేశారు. తొలిదశలో గాంధీ పార్కు ప్రధాన ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేశారు.

### 'చిల్లీస్ సిటీ'గా ప్రత్యేక గుర్తింపు

గుంటూరు మిర్చికి ఉన్న ప్రత్యేకతను ప్రతిబింబించేలా పొన్నూరు రోడ్డు నుంచి నగరంలోకి వచ్చే మార్గంలో 'గుంటూరు-చిల్లీస్ సిటీ ఆఫ్ ఇండియా' పేరుతో ప్రత్యేక స్వాగత బోర్డును ఏర్పాటు చేయనున్నారు. నగరానికి ఉన్న ప్రత్యేక గుర్తింపును సందర్శకులకు పరిచయం చేసేలా దీన్ని రూపొందిస్తున్నారు.

### ఎనిమిది చోట్ల..

ఆటోనగర్ వై-జంక్షన్, నందివెలుగు ఆర్‌ఓబీ వద్ద మానస సరోవరం పార్కు, గుజ్జనగుండ్ల జంక్షన్, అమరావతి రోడ్డు, కోరిటెపాడు పార్కు జంక్షన్‌తో పాటు ప్రధాన నగర ప్రవేశ మార్గాల్లో ఈ బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన జంక్షన్లు, రద్దీ ప్రాంతాలు, నగర ప్రవేశ మార్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

### సెల్ఫీ పాయింట్లుగా..

బోర్డులను కేవలం అలంకరణకు పరిమితం చేయకుండా వినూత్న ఆకృతుల్లో రూపొందించనున్నారు. రాత్రివేళల్లో ప్రత్యేక వెలుగులతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నారు. దీంతో ఇవి నగర ప్రజలకు, సందర్శకులకు ప్రత్యేక 'సెల్ఫీ పాయింట్లు'గా మారనున్నాయి. నగర సుందరీకరణతోపాటు గుంటూరుకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. బోర్డుల ఏర్పాటుతో నగర రూపురేఖలు మరింత ఆకర్షణీయంగా మారతాయని పేర్కొన్నారు. వాటి సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

# మంగళగిరి వైఎస్సార్‌సీపీకి కొత్త సారథి

**- ఇన్‌ఛార్జ్‌గా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి - దొంతిరెడ్డి వేమారెడ్డికి బదులుగా స్థానిక నేతకు బాధ్యతలు**

మంగళగిరి (ప్రశ్న న్యూస్) మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీలో కీలక మార్పు చోటుచేసుకుంది. నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా తాడేపల్లికి చెందిన బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డిని ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఇప్పటివరకు సమన్వయకర్తగా వ్యవహరించిన దొంతిరెడ్డి వేమారెడ్డి స్థానంలో సోమిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి నియామకాన్ని ప్రకటించారు.

### స్థానిక నేతకే ప్రాధాన్యం

తాడేపల్లి పట్టణ రాజకీయాల్లో సుదీర్ఘకాలంగా క్రియాశీలకంగా ఉన్న వేణుగోపాల సోమిరెడ్డికి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన గతంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులతో సమన్వయం చేస్తూ తాడేపల్లి ప్రాంతంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహించారు.
నియోజకవర్గంలో పార్టీ క్యాడర్‌తో నిరంతరం అందుబాటులో ఉండే స్థానిక నేతగా సోమిరెడ్డికి ఉన్న పరిచయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### క్యాడర్ సమన్వయమే కీలకం

2024 అసెంబ్లీ ఎన్నికల అనంతరం మంగళగిరిలో వైఎస్సార్‌సీపీకి సంస్థాగతంగా మరింత బలం చేకూర్చే దిశగా పార్టీ అధిష్ఠానం మార్పులు చేపడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో నియోజకవర్గ సమన్వయకర్తగా దొంతిరెడ్డి వేమారెడ్డి వ్యవహరించగా.. తాజాగా ఆయన స్థానంలో సోమిరెడ్డిని నియమించారు. కార్యకర్తలకు అందుబాటులో ఉండటం, స్థానిక సమస్యలపై స్పందించడం, గ్రామ--వార్డు స్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేయడం వంటి అంశాలపై కొత్త ఇన్‌ఛార్జ్ దృష్టి సారించాల్సి ఉంటుంది.

### లోకేష్ నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామం


మంత్రి నారా లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ మార్పు రాజకీయంగా ఆసక్తి రేపుతోంది. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మురుగుడు లావణ్య పోటీ చేశారు. ఎన్నికల అనంతరం పార్టీ సమన్వయకర్తగా దొంతిరెడ్డి వేమారెడ్డిని నియమించారు. ఇప్పుడు స్థానికంగా పార్టీతో అనుబంధం ఉన్న వేణుగోపాల సోమిరెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో మంగళగిరి వైఎస్సార్‌సీపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచినట్లయింది.

### క్యాడర్‌లో కొత్త ఉత్సాహం వస్తుందా?



కొత్త ఇన్‌ఛార్జ్ నియామకంతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం తీసుకురావడంతో పాటు నియోజకవర్గ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంపై దృష్టి సారించే అవకాశం ఉంది. స్థానిక నాయకత్వాన్ని బలోపేతం చేయడం, కార్యకర్తలను క్రియాశీలం చేయడం, ప్రజా సమస్యలపై పోరాటాలను నిర్వహించడం తదుపరి కార్యాచరణలో కీలకం కానుంది. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీకి కొత్త ఇన్‌ఛార్జ్‌గా వేణుగోపాల సోమిరెడ్డి నియామకం నేపథ్యంలో ఇకపై నియోజకవర్గ రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

# వర్షాలు లేక, పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య



ఆదిలాబాద్ : ఆదిలాబాద్ గ్రామీణ మండలంలో సాంగ్వి గ్రామానికి చెందిన తీగల రమేశ్ (47) అనే రైతు బలవన్మరణానికి పాల్పడ్డారు. 8 ఎకరాల్లో పత్తి, కంది సాగు చేసిన రమేశ్ సరిపడా వర్షాలు లేక పంట దిగుబడి తగ్గడంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. వ్యవసాయ సహకార బ్యాంకులో తీసుకున్న సుమారు రూ.15 లక్షల రుణం అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపం చెందినట్లు కుటుంబీకుల వెల్లడించారు. చనాఖా-కోర్ట కెనాల్ సమీపంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# ఇంద్రకీలాద్రిపై భక్తుల పోటెత్తు

# సామాన్య భక్తులకు వేగంగా దర్శనం

**- ఉదయం 11 గంటల నుంచి అంతరాలయ దర్శనాలు నిలుపుదల**

**- రద్దీని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన ఈవో శీనా నాయక్**

విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆదివారం సెలవు దినం కావడంతో ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. జగన్మాత శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక పెరగడంతో క్యూలైన్లు, ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తుల రద్దీ నేపథ్యంలో సామాన్య భక్తులకు త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటల నుంచి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలుపుదల చేసి, లఘు దర్శనాలను కొనసాగించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దర్శనం వేగంగా జరిగేలా ఏర్పాట్లు చేశారు.

### ఈవో క్షేత్రస్థాయి పర్యవేక్షణ

భక్తుల రద్దీని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ స్వయంగా పరిశీలించారు. క్యూలైన్లలో పరిస్థితిని తెలుసుకుంటూ, భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు వినియోగించే లిఫ్టుల వద్ద రద్దీ పెరగకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించి రాకపోకలను క్రమబద్ధీకరించారు.

### మంచినీరు.. అన్నప్రసాదం

ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తులకు మంచినీటి సరఫరాను పెంచారు. తాగునీటి విభాగం సిబ్బంది నిరంతరం భక్తులకు చల్లని మంచినీటిని అందించేలా చర్యలు చేపట్టారు.
నూతన అన్నదాన భవనంలో భక్తులకు నిరంతరాయంగా వేడి అన్నప్రసాదం అందించారు. దర్శనం అనంతరం భక్తులందరికీ ఉచిత ప్రసాదం అందేలా ఏర్పాట్లు చేశారు.

### సూర్యోపాసన సేవ

ఆదివారం సందర్భంగా ఆలయంలో సంప్రదాయబద్ధంగా విశేష సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆర్జిత సేవలు జరిగే అన్ని ప్రాంగణాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని భక్తుల భద్రత, దర్శన సౌకర్యాలపై దేవస్థానం అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించారు.





# బాక్సాఫీస్ వద్ద ఆగని నాని జోరు..

## – మూడ్రోజుల్లో 'ది ప్యారడైజ్'కు భారీ వసూళ్లు



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద వసూళ్ల వర్షం కురిపిస్తోంది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 136 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి మిక్సడ్ టాక్ వచ్చినప్పటికీ, నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా రూ. 100 కోట్ల గ్రాస్ మార్క్‌ను అధిగమించిన సినిమాగా ఇప్పటికే రికార్డు సృష్టించింది. ఇప్పుడు మూడు రోజులకే ఈ భారీ వసూళ్లతో తన సత్తా చాటుతోంది. సినిమా వసూళ్లను పరిశీలిస్తే, మూడో రోజు సుమారు రూ. 22 కోట్ల గ్రాస్ వచ్చినట్లు తెలుస్తోంది. రెండో రోజుతో పోలిస్తే వసూళ్లలో స్వల్ప తగ్గుదల కనిపించినా, వారాంతపు సెలవుల కారణంగా కలెక్షన్లు స్థిరంగా కొనసాగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇవాళ కూడా దాదాపు ఇదే స్థాయిలో వసూళ్లు నమోదయ్యే అవకాశం ఉందని, ఇదే జోరు కొనసాగితే త్వరలోనే 'ది ప్యారడైజ్' రూ. 150 కోట్ల గ్రాస్ మార్క్‌ను కూడా సులభంగా అందుకుంటుందని అంచనాలు వెలువడుతున్నాయి.



# పెదవులకు సర్జరీపై వెనక్కి తగ్గా..

## సాయి పల్లవిని చూసి నేర్చుకున్నా: నివేదా పేతురాజ్

'మెంటల్ మది' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా పేతురాజ్, తన కెరీర్‌కు సంబంధించి కొన్ని సంచలన విషయాలను బయటపెట్టారు. ఒకానొక దశలో తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురై, నటనకు పూర్తిగా గుడ్‌బై చెప్పాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఒకవేళ మళ్లీ అవకాశాలు రాకపోతే హిమాలయాలకు వెళ్లి ధ్యానం చేసుకుంటూ గడపాలని కూడా భావించినట్లు ఆమె చెప్పడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఆమె త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు.దనివేదా తాజాగా తన గతాన్ని గుర్తుచేసుకుంటూ, 2023లో కొన్ని తప్పుడు నిర్ణయాలు, వ్యక్తిగత కారణాల వల్ల తీవ్రమైన డిప్రెషన్‌తో పాటు పానిక్ అటాక్స్‌ను ఎదుర్కొన్నానని వెల్లడించారు. ఆ పరిస్థితుల నుంచి బయటపడటానికి చాలా సమయం పట్టిందని, ఆ సమయంలోనే సినిమాలకు దూరమవ్వాలనే ఆలోచన వచ్చిందని చెప్పారు. అదృష్టవశాత్తూ పరిస్థితులు అనుకూలించి మళ్లీ అవకాశాలు రావడంతో నటనపై దృష్టి సారించినట్లు వివరించారు. అంతేగాక కెరీర్ ఆరంభంలో తన రూపంపై అసంతృప్తితో పెదవులకు సర్జరీ చేయించుకోవాలని కూడా ఆలోచించినట్లు నివేదా తెలిపారు.

ఈ విషయం గురించి తన వైద్యుడిని సంప్రదించగా, ఆయన తీవ్రంగా మందలించారని, భవిష్యత్తులో వచ్చే ఆరోగ్య సమస్యల గురించి హెచ్చరించడంతో ఆ ఆలోచనను విరమించుకున్నానని అన్నారు. "సహజ సౌందర్యంతోనే సాయి పల్లవి, నిత్యామీనన్ వంటి నటీమణులు ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. వారిని చూశాక, నా రూపం గురించి నేను అనవసరంగా ఎందుకు ఆందోళన చెందుతున్నానో అర్థమైంది" అని నివేదా పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకో విచిత్రమైన అనుభవం ఉందని, తాను ప్రతికూలంగా ఏదైనా ఊహించుకుంటే అది నిజమవుతుందని నివేదా పంచుకున్నారు. తన మాజీ ప్రియుడి విషయంలోనూ ఇలాంటిదే జరిగిందని, ఆ తర్వాత నుంచి ఎక్కువగా ఆలోచించడం మానేశానని ఆమె తెలిపారు. కష్టకాలం నుంచి బయటపడి ఇప్పుడు మళ్లీ సినిమాలతో బిజీ అవ్వడం సంతోషంగా ఉందని నివేదా అన్నారు.


# తెలుగులో వస్తున్న 'డోరతీ'

ఇటీవల విడుదలై తమిళంలో మంచి ఆదరణ సొంతం చేసుకున్న క్రైమ్ డ్రామా 'డోరతి' తెలుగులో రానుంది. కీర్తి సురేష్, సనంత్, రిషికాంత్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా పలు చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు పొందింది. కులం, హింస, పురుషాధిక్య భావజాలంతో సాగే ఈ గ్రామీణ కథాంశమిది. ఇద్దరు స్నేహితుల చుట్టూ నడిచే ఈ కథలో.. డోరతి అనే మహిళ ప్రవేశించి వారి జీవితాల్ని ఎలా ప్రభావితం చేసిందన్నదే సినిమా ఇతివృత్తం.ఇందులో కీర్తి సురేష్ స్క్రీన్‌స్పేస్ తక్కువే అయినప్పటికీ హింస నుంచి మనుషుల్ని పరివర్తన వైపు నడిపించే మహిళగా కథాగమనంలో కీలకంగా ఉంటుంది. రానాకు చెందిన స్పిరిట్ మీడియా సంస్థ తెలుగులో ఈ సినిమా హక్కుల్ని దక్కించుకుంది. అక్టోబర్ 2న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



# విజయ్ దేవరకొండ 'రణబాలి'కి ముందు ఓటీటీ సర్‌ప్రైజ్..

## – 4 ఎపిసోడ్ల డాక్యుమెంటరీ సిరీస్



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'. 'ట్యాక్సీవాలా', 'శ్యామ్ సింగ రాయ్' వంటి విభిన్న చిత్రాలను తెరకెక్కించిన రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ డ్రామా విజయదశమి కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది.సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండగానే 'రణబాలి' గురించి ఓ ఆసక్తికరమైన ప్రకటన వెలువడింది. సాధారణంగా సినిమా థియేటర్లలో విడుదలైన తర్వాత ఓటీటీలోకి వస్తుంది. కానీ 'రణబాలి' విషయంలో మాత్రం మేకర్స్ ఓ విభిన్నమైన ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సినిమా కథకు సంబంధించిన నేపథ్యాన్ని ప్రేక్షకులకు ముందుగానే పరిచయం చేసేందుకు అంతర్జాతీయ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో నాలుగు ఎపిసోడ్ల ప్రత్యేక డాక్యుమెంటరీ సిరీస్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. 'రణబాలి: నెవర్ ఫర్‌గెట్ ది ట్రూత్' పేరుతో ఈ ప్రత్యేక సిరీస్ రూపొందుతోంది. 19వ శతాబ్దంలో బ్రిటిష్ పాలనకు సంబంధించిన చారిత్రక అంశాలతో పాటు.. 'రణబాలి' సినిమా నేపథ్యానికి సంబంధించిన వివరాలు, ప్రత్యేకమైన తెరవెనుక విశేషాలు ఇందులో ఉండనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది.ఈ డాక్యుమెంటరీ సిరీస్‌లో మొత్తం నాలుగు ఎపిసోడ్లు ఉండనున్నాయి. మొదటి ఎపిసోడ్ 'ది ఫెమైన్ వి ఫర్‌గాట్' పేరుతో సెప్టెంబర్ 28న విడుదల కానుంది. రెండో ఎపిసోడ్ 'ది హిస్టరీ వి ఫర్‌గాట్' పేరుతో సెప్టెంబర్ 30న స్ట్రీమింగ్‌కు రానుంది. మూడో ఎపిసోడ్ 'ది మెన్ వి ఫర్‌గాట్' పేరుతో అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రానుంది. నాలుగో ఎపిసోడ్ 'ది లాస్ట్ లోడ్' పేరుతో రూపొందుతుండగా.. దాని విడుదల తేదీని మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు. చరిత్రకు సాధారణంగా రెండు కోణాలు ఉంటాయని.. ఒకటి పుస్తకాల్లో మనకు పరిచయమైన చరిత్ర కాగా, మరొకటి కాలగర్భంలో కలిసిపోయిన లేదా విస్మరించబడిన అంశాలు ఉంటాయనే భావనతో ఈ సిరీస్‌ను రూపొందించినట్లు ప్రచారం జరుగుతోంది. సమాజానికి తెలియని చారిత్రక నేపథ్యాలను, అప్పటి పరిస్థితులను ఈ డాక్యుమెంటరీ ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా థియేటర్లలో 'రణబాలి' కథను చూసే ముందు.. ఆ కథకు సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని ప్రేక్షకులకు అర్థమయ్యేలా చేయడం ఈ డాక్యుమెంటరీ సిరీస్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. సినిమా విడుదలకు దాదాపు రెండు వారాల ముందే తొలి ఎపిసోడ్ స్ట్రీమింగ్ కానుండటంతో.. ఈ సిరీస్ ద్వారా సినిమాపై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెంచే ప్రయత్నం జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ చిత్రం పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పుడు సినిమా కంటే ముందే దాని నేపథ్యాన్ని వివరించే డాక్యుమెంటరీ సిరీస్‌ను ఓటీటీలోకి తీసుకురావడం 'రణబాలి' ప్రాజెక్ట్‌పై ఆసక్తిని మరింత పెంచుతోంది. సెప్టెంబర్ 28 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ప్రారంభం కానున్న ఈ నాలుగు ఎపిసోడ్ల సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది? అలాగే ఈ డాక్యుమెంటరీ సినిమా కథను అర్థం చేసుకోవడంలో ఎంతవరకు ఉపయోగపడుతుంది? అనేది ఆసక్తికరంగా మారింది.

# ఓటీటీ హిట్..

## ఆత్మరక్షణ అవసరం



నేటి సమాజంలో జరుగుతున్న కొన్ని దురదృష్టకర సంఘటనలు ఆడపిల్లల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అమ్మాయిని బయటికి పంపించడమంటే.. ప్రమాదంలోకి నెట్టడమేనని భావించేలా చేస్తున్నాయి. దాంతో, చాలావరకు వారితో ఎవరో ఒకరిని తోడుగా పంపించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలను నేర్పించాల్సిన అవసరాలను కూడా నొక్కి చెబుతున్నాయి. ఇదే పాయింట్ ఆధారంగా మలయాళంలో తెరకెక్కిన చిత్రం 'తుడక్కమ్'. అంటే.. ఆరంభం! మలయాళ అగ్రనటుడు మోహన్‌లాల్ తనయ విస్మయ మోహన్‌లాల్ వెండితెరకు పరిచయమైన ఈ చిత్రం.. బాక్సాఫీస్ దగ్గర 40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. తాజాగా 'జియో హాట్ స్టార్' వేదికగా తెలుగులో స్ట్రీమింగ్‌కు వచ్చింది. మీనూ (విస్మయ మోహన్‌లాల్) అనే అమ్మాయి చుట్టూ తిరిగే సర్వైవల్ థ్రిల్లర్ కథ ఇది. ఆమె తండ్రి రవి బాల చంద్రన్ (సాయికుమార్) విలేజ్ ఆఫీసర్‌గా పనిచేస్తుంటాడు. అతని రెండు కాళ్లూ చచ్చుబడి పోవడం వల్ల, వీల్‌చైర్‌లో కూర్చునే విధులు నిర్వహిస్తుంటాడు. తల్లిలేని బిడ్డ కావడంతో మీనూను చాలా గారాబంగా పెంచుతాడు. వీళ్ల ఇల్లు ఊరికి దూరంగా ఉంటుంది. అక్కడికి దగ్గర్లో జోసెఫ్ మాస్టర్ ఇల్లు తప్ప.. మరెవరూ ఉండరు. మీనూ ఓవైపు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూనే, మరోవైపు అదే ఊళ్లో చిన్న పిల్లలకు మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తూ ఉంటుంది. ధైర్య సాహసాలతోపాటు ఎదుటివారికి సాయం చేయడంలోనూ ఎప్పుడూ ముందుంటుంది. అలాంటి మీనూ.. ఒకరోజు ఎగ్జామ్ రాయడానికి స్నేహితురాలు ప్రియతో కలిసి సమీపంలోని పట్టణానికి వెళ్తుంది. కానీ, రాత్రయినా ఇంటికి తిరిగి రాదు. రవి ఫోన్ చేసి మాట్లాడితే.. ట్రాఫిక్‌లో ఇరుక్కున్నానని చెబుతుంది. ఫోన్‌లో మాట్లాడుతూనే.. ఎవరితోనో గొడవ పడుతుంది. ఆ మాటలు ఫోన్‌లోనే వింటాడు రవి. మళ్లీ కాల్ చేస్తే.. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుంది. దాంతో, కూతురు ఆపదలో పడిందని ఆందోళనకు గురవుతాడు. తోడుగా వెళ్లిన ప్రియ కూడా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో మరింత టెన్షన్ పడతాడు. అసలు మీనూ ఎవరితో గొడవ పడింది? ఈ క్రమంలో ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నది? అందులోంచి ఎలా బయటపడ్డది? ఈమధ్యలో మాస్టర్ (మోహన్ లాల్) ఎవరు? అతనికి, మీనూకి మధ్య ఉన్న అనుబంధం ఏంటి? అసలు.. మీనూ మిస్సింగ్ వెనక ఉన్న కథ ఏంటి? అది తెలియాలంటే.. సినిమా చూడాల్సిందే!

# వారితో ప్రయాణం ప్రమాదకరం



'బంధాలకు పునాది నమ్మకమే. ఆ నమ్మకం ఒక్కసారి ఒమ్మయితే, పరిస్థితుల్ని మళ్లీ పూర్వస్థితికి తీసుకురావడం అసాధ్యం' అంటున్నది అందాలభామ కాజల్ అగర్వాల్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మానవ సంబంధాలు, మానసిక ప్రశాంతతలపై ఆసక్తికరంగా మాట్లాడింది కాజల్. 'ప్రేమ, స్నేహం, కుటుంబం, వృత్తి.. ఇలా ఎక్కడైనా సరే.. నమ్మకద్రోహానికి ఒడిగట్టే వ్యక్తులకు జీవితంలో స్థానం ఇవ్వకూడదు. స్వార్థపూరిత ఆలోచనలతో నమ్మకాన్ని తుంగలో తొక్కే వారితో కలిసి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరం. పైకి నవ్వుతూ, లోపల స్వార్థాన్ని దాచుకునే వారిని గుర్తించి, వారికి దూరంగా ఉండటమే శ్రీరామరక్ష. అవసరాల కోసం స్నేహాన్నీ, సంబంధాలనూ వాడుకునే స్వార్థపరులు ప్రతి రంగంలోనూ ఉంటారు' అని కాజల్ వ్యాఖ్యానించింది. ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# బంగారం సామ్రాజ్యం వెనక



విక్రమ్‌ప్రభు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సిటీ ఆఫ్ గోల్డ్'. సిద్ధార్థ్ దర్శకుడు. రోమియో పిక్చర్స్ పతాకంపై రాహుల్ నిర్మిస్తున్నారు. శివాత్మిక రాజశేఖర్ కథానాయికగా నటిస్తున్నది. శనివారం సినిమా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. ఇందులో విక్రమ్‌ప్రభు బంగారు బిస్కెట్స్‌తో కనిపిస్తున్నారు.బంగారం వ్యాపారం వెనుక పనిచేసే వ్యక్తుల జీవితాలు, తెరవెనక ఎవరికీ తెలియని సంచలన విషయాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విభిన్నమైన కాన్సెప్ట్, ఇంట్రెస్టింగ్ విజువల్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, యాక్షన్ ఘట్టాలు అబ్బురపరుస్తాయని మేకర్స్ తెలిపారు. అలగం పెరూమాళ్, జాఫర్ ఇడుక్కి జీఎం సుందర్, వసుంధర తదితరులు చిత్ర తారాగణం.

# కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘనంగా నివాళులు

## జన సమితి కార్యాలయంలో బాపూజీ 111వ జయంతి వేడుకలు




హైదరాబాదు (ప్రశ్న న్యూస్) తెలంగాణ ఆత్మ గౌరవం కోసం, రాష్ట్ర సాధన కోసం, సామాజిక న్యాయం కోసం అనునిత్యం పరితపిస్తూ పోరాడిన పోరాట ధీరుడు ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ అని తెలంగాణ జన సమితి థియేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య కొనియాడారు. తెలంగాణ జన సమితి అనుబంధ బీసీ జన సమితి బాపూజీ 111వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసయ్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిజం వ్యతిరేక ఉద్యమం, స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న స్ఫూర్తితో కొండ లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యమంలో సైతం ముందు బాగాన నిలిచారని అన్నారు. 1969లో మంత్రి పదవికి రాజీనామా చేసిన బాపూజీ స్వరాష్ట్రం సిద్ధించేంతవరకు పదవులను తీసుకోనని శబదం చేసిన నిజాయితీ రాజకీయ నాయకుడు అని ప్రశంసించారు. సామాజిక న్యాయం కోసం పోరాటమే ఆయనకు జన సమితి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు ఎం లక్ష్మణ్ పి జయపాల్ రెడ్డి, వేణుగోపాల్, కాకునూరి సుధాకర్,సదానంద్,వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాపూజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలి

## ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. దండ రాజిరెడ్డి పిలుపునిచ్చారు.బాపూజీ జయంతిని పురస్కరించుకుని విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి ఉపకులపతి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బాపూజీ సేవలను స్మరించుకున్నారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు.స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని, వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని సూచించారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. కృత్రిమ మేధస్సు (ఎ ఐ ), రిమోట్ సెన్సింగ్, జి ఐ ఎస్ , డ్రోన్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతికతలను ఉద్యాన రంగంలో వినియోగించేలా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రైతుల సమస్యలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాలు చూపే దిశగా విశ్వవిద్యాలయంలో పరిశోధనలు కొనసాగాలని ఉపకులపతి ఆకాంక్షించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజ ప్రయోజనాలకు వినియోగిస్తూ దేశాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఏ. భగవాన్, పరిశోధనా విభాగం సంచాలకులు డా. డి. లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డైరెక్టర్ ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డా. ఎన్. శ్రీనివాసన్, సహాయ కంట్రోలర్ చెంచు రామయ్య, ఏఈ రమేష్, విద్యార్థులు, బోధన, బోధనేతర, అవుట్‌సోర్సింగ్, ఒప్పంద సిబ్బంది పాల్గొన్నారు.

# విఘ్నేశ్వర లడ్డూ వేలంలో అంకర్ల యశ్వంత్ జోరు..

## వరుసగా రెండోసారి గెలిచిన బీజేపీ నాయకుడు

- అంకర్ల యశ్వంత్ ను వరించిన 54 కిలోల భారీ గణపతి లడ్డూ
- లడ్డూ వేలంలో భక్తి జోష్.. రూ.2.10 లక్షలకు ఫైనల్
- పటేల్ నగర్‌లో రూ.2.10 లక్షలకు 54 కిలోల లడ్డూ వేలం




అంబర్ పేట (ప్రశ్న న్యూస్) వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా పటేల్ నగర్ దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయకుని లడ్డూ వేలం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేలంలో 54 కిలోల భారీ లడ్డూ రూ. 2,10,000లకు అంకర్ల యశ్వంత్ కైవసం చేసుకున్నారు. గత ఏడాది కూడా వినాయకుని లడ్డూను దక్కించుకున్న ఏ. యశ్వంత్, ఈ ఏడాది వరుసగా రెండోసారి వేలంలో లడ్డూను సొంతం చేసుకోవడం విశేషంగా నిలిచింది. లడ్డూ వేలంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని పోటీ పడ్డారు. వినాయకుని లడ్డూను దక్కించుకోవడం ద్వారా తమ కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు లభిస్తాయని భక్తులు విశ్వసించారు. ఈ సందర్భంగా ఏ. యశ్వంత్ మాట్లాడుతూ, విఘ్నేశ్వరుని కృపతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. వినాయక చవితి వేడుకల్లో భాగంగా దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

# కమిషనర్ ఆదేశాలు బేఖాతరు.?

- కీసరలో అక్రమ నిర్మాణాలకు డీసీ అడ్డుకట్ట ఎక్కడ.?
- ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా నోటీసులకే పరిమితమవుతున్న చర్యలు
- ప్రజలకు రిపోర్టర్లకు చర్యలు తీసుకుంటాం అంటున్న డిసి కానీ నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్న వైనం
- అక్రమ నిర్మాణాలకు పూర్తిగా వత్తాసు పలుకుతున్న సెక్షన్ ఆఫీసర్ మేఘన
- అక్రమ షెడ్లు, భవనాలతో మున్సిపల్ ఆదాయానికి భారీ గండి.?
- డిప్యూటీ కమిషనర్ రామలింగం తీరుపై స్థానికుల అసంతృప్తి



కీసర ( ప్రశ్న న్యూస్) కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు,




అనుమతులకు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు, అక్రమ షెడ్లు వెలుస్తున్నాయని స్థానికులు తెలిపారు. ఈ వ్యవహారంపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా చర్యలు మాత్రం నోటీసులు జారీ చేసే స్థాయిలోనే నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కీసర, దమ్మాయిగూడ డివిజన్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు అందుతున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో అడ్డుకోవడంలో కీసర డిప్యూటీ కమిషనర్ రామలింగం విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదులు అందిన ప్రతిసారీ నోటీసులు ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఆ తర్వాత నిర్మాణాలపై తీసుకున్న చర్యలు ఏమిటన్నది స్పష్టంగా తెలపడం లేదని అంతర్గత ఒప్పందం చేసుకున్నారా.? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### కమిషనర్ ఆదేశాలు బేఖాతరా



మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అక్రమ నిర్మాణాల విషయంలో ఉపేక్షించవద్దని, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినప్పటికీ, కీసర సర్కిల్‌లో మాత్రం పరిస్థితుల్లో పెద్దగా మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.కమిషనర్ ఆదేశాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు అమలవుతున్నాయి.? అక్రమ నిర్మాణాలపై ఎన్ని నోటీసులు జారీ చేశారు.? ఎన్ని నిర్మాణాలపై కూల్చివేతలు లేదా ఇతర చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.? ఎన్ని ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి.? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని, జోనల్ కమిషనర్, సిసిపి సైతం సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.కార్యాలయానికి వెళ్తే కలవడు, ఎక్కడుంటాడో తెలియదు, ఫోన్ ఎత్తడు ఏం చేసేది..తమ సమస్యలను చెప్పేందుకు డిప్యూటీ కమిషనర్ రామలింగం కార్యాలయానికి వెళ్లినప్పటికీ ఆయనను కలవడం అత్యంత కష్టంగా మారుతోందని కొందరు ఫిర్యాదుదారులు ఆరోపిస్తున్నారు. ప్రజలు, ఫిర్యాదుదారులు అధికారులను నేరుగా కలిసి తమ సమస్యలను వివరించే అవకాశం మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ పరిధిలో లేకపోవడం వల్ల సమస్యలు మరింత జటిలమవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

### అక్రమ నిర్మాణాలతో మున్సిపల్ ఆదాయానికి గండి..

అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు కొనసాగితే మున్సిపాలిటీకి రావాల్సిన అనుమతుల రుసుములు, పన్నులు తదితర ఆదాయాలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి అడ్డుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు ఆలస్యం చేస్తే నిర్మాణాలు పూర్తయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, కావాలని సెక్షన్ ఆఫీసర్ మేఘన, డిప్యూటీ కమిషనర్ రామలింగం, సిబ్బంది చేస్తున్నారని ప్రజలు పేర్కొన్నారు.

### 'నోటీసులు'తోనే సరిపెట్టడమెందుకు

ఫిర్యాదు చేస్తే నోటీసులు ఇస్తున్నామని చెబుతున్నారు. కానీ నోటీసుల తర్వాత ఏం జరిగింది.? నిర్మాణం నిలిపివేశారా.? కూల్చివేత చర్యలు తీసుకున్నారా.? అనుమతులు ఉన్నాయా లేదా అన్నది ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు.? మున్సిపల్ నిబంధన ప్రకారం పర్మిషన్ కాపీని బిల్డింగ్ నిర్మాణం వద్ద అంటించాలి ఎందుకు అందించడం లేదు అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కీసర సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై వచ్చిన ఫిర్యాదులన్నింటినీ ఉన్నతాధికారులు పరిశీలించి, ప్రతి ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. డిప్యూటీ కమిషనర్ రాజలింగం, టౌన్ ప్లానింగ్ అధికారిని మేఘన పనితీరుపైనా స్టేట్ విజిలెన్స్, ఏసీబీ అధికారులచే పూర్తిస్థాయిలో సమీక్ష నిర్వహించి, అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో ఎక్కడ లోపం జరుగుతోందో తెలుసుకొని లేక అధికారులు అవినీతికి పాల్పడ్డారో తెలుసుకొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# తెలంగాణలో రియల్ ఎస్టేట్ కుప్పకూలిపోయింది

- పోలీసులు శాంతి భద్రతలను పరీక్షించాలి కానీ
- అంబేద్కర్ రాజ్యాంగం కాదు అనుముల రేవంత్ రెడ్డి రాజ్యాంగం
- వాన పాములు నాగుపాములై బుస కొడుతుండ్రు ఎవరిని వదిలిపెట్టం
- ఫ్యూచర్ సిటీ లేదు గాడిద గుడ్డు లేదు
- బి ఆర్ ఎస్ చీఫ్ కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఇక రెండేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది
- బిఆర్ఎస్ పార్టీలో చేరిన పలువురు నాయకులకు కండువా కప్పిన ఆహ్వానించిన కే టి ఆర్



శంషాబాద్ (ప్రశ్న న్యూస్ ) కాంగ్రెస్ ప్రభుత్వ అధికారులకు వచ్చి మూడేళ్లు గడుస్తున్న ప్రజా సమస్యల పరిష్కార విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో పోలీసులు శాంతిభద్రతలపై దృష్టి సారించకుండా డీజేలు బంద్ చేయడానికి పరిమితమయ్యారని ఆరోపించారు. ఆదివారం శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని బి ఆర్ ఎస్ రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్కు చెందిన పలువురు సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బి ఆర్ ఎస్ పార్టీలో చేరారు. . ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గుంటకల్ల జగదీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, తదితరులతో కలిసి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసులు శాంతిభద్రతలు పరిరక్షించడానికి లేదా బంద్ చేయడానికి అని అన్నారు. రాష్ట్రంలో తెలంగాణ పోరాటాల గడ్డ ని గడ్డి పోచ కూడా గడ్డపారలై తిరగబడతారనేది గుర్తుంచుకోవాలన్నారు. ఇటీవల ఒక సినిమాలో మూడు గంటల సినిమా ఉంటే నాలుగు నిమిషాలు కేసీఆర్ గురించి వింటే థియేటర్ దద్దరిల్లిపోయిందని ఆయన అన్నారు. తెలంగాణ ప్రజలకు స్వేచ్ఛనిచ్చిన నాయకుడు ప్రజల గొంతుకై నిలిచిన నాయకుడు కేసీఆరే అన్నారు. పోయింది అధికారం మాత్రమే కానీ కెసిఆర్ పై ప్రేమ అనురాగాలు పోలేదని, రాష్ట్రంలో కరెంటు పోయిన ప్రతిసారి ప్రజలకు కెసిఆర్ ఏ గుర్తుకొస్తున్నారని ప్రతి అడుగులో కేసీఆర్ ఉన్నారని తెలిపారు. ఇటీవల ఓ మీటింగ్ వెళితే అక్కడ పారిశ్రామికవేత్తలు మీరు తొందర అధికారంలోకి అని అంటున్నారని తెలిపారు నాగార్జునసాగర్ లో నీళ్లు లేవని



వదలడం లేదని అక్కడ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని రాష్ట్రంలో ప్రజలు నిరాశ, నిస్పృహలతో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో నీళ్లు లేవు కరెంటు లేవు, పథకాలు లేవు శాంతిభద్రతలు సరిగా లేవు, అని ఆయన విమర్శించారు. కెసిఆర్ అధికారంలో ఉంటే ఈపాటికి రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో ట్రైన్ ఎప్పుడో కంప్లీట్ అయ్యేదని, ఇక రియల్ ఎస్టేట్ మొత్తం రాష్ట్రంలో కుప్పకూలిపోయిందని అన్నారు. ముఖ్యమంత్రికి భూములు తప్ప ఇంకోటి తెలియటం లేదని పేదల ఇల్లులు కూలగొట్టడం ఇది దారుణం అన్నారు. మూసి ప్రక్షాళన ప్రాజెక్టు విషయంలో లంగర్ హౌస్ లో ఇల్లు కూల్చేస్తామంటున్న విషయంలో చిన్న పిల్లలు తీసుకొని మా ఇల్లులు కూలగొట్టకండి మేము దాచుకున్న డబ్బులు రేవంత్ సార్ కి ఇవ్వండి అని ప్రాధేయపడడం చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని అన్నారు. పేదల ఇళ్లపై ఆరోపణలు హైదరాబాదులోని 58, 59 జీవుల కింద రెండు లక్షల మంది పేదలకు పట్టాలు ఇచ్చి లక్ష డబుల్ బెడ్ రూములు ఇల్లు నిర్మించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు దక్కుతుందని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లు కావస్తున్నా ఒక్క ఇల్లు నిర్మించలేదని ఒక్క ఇటుక పెట్టలేదని అన్నారు. కానీ ఇల్లు కట్టుకుంటే మాత్రం కూల్చివేస్తున్నారని విమర్శించారు. పేదల ఇళ్లపై మాత్రం ప్రతాపం చూపిస్తున్నారని ఎఫ్టిఎల్ పరిధిలో కాంగ్రెస్ నేతలకు చెందిన పొంగులేటి ఫామ్ హౌస్, పట్నం మహేందర్ రెడ్డి ఫామ్ హౌస్, వివేక్ వెంకటస్వామి లాంటి వాటి జోలికి వెళ్లే ధైర్యం ప్రభుత్వానికి లేదని పేదలైన విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో దోమల సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. బి ఆర్ఎస్ లోకి భారీగా నాయకులు చేరారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాలకు చెందిన మాజీ సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు మాజీ జెడ్పిటిసిలు ఎంపీటీసీలు కాంగ్రెస్ కార్యకర్తలు, శంషాబాద్ నాయకులతో పాటు సుమారు 500 మంది బిఆర్ఎస్ పార్టీలో చేరినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ఎస్ ఇంచార్జ్ పట్ల కార్తీకరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఈ పార్టీలో చేరినట్లు తెలిపారు. స్థానిక ఎన్నికల్లో టిఆర్ఎస్ జండా ఎగరవేయడమే లక్ష్యం కావాలి ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిఆర్ఎస్ జండా ఎగరేయడానికి నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొనమల శ్రీనివాస్, కొలను ప్రదీప్ రెడ్డి, శంషాబాద్ మండల అధ్యక్షులు మాచర్ల మోహన్ రావు, సీనియర్ నాయకులు దేవరంపల్లి బుచ్చిరెడ్డి, గౌస్ బాషా, రమేష్, రాచమల్ల జయసింహ, మంచర్ల శ్రీనివాస్, దీప మల్లేష్, సీనియర్ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దసరాకు విజయవాడ ఉత్సవ శోభ!

- అక్టోబరు 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ - 8 నుంచి 23 వరకు జాతీయ సరస్సు మేళ
- 18 ఎకరాల పున్నమిఘాట్‌లో సాంస్కృతిక సంబరాలు - భక్తి.. సంస్కృతి.. కళలు.. రుచులతో ప్రత్యేక ఆకర్షణలు

విజయవాడ(ప్రశ్న న్యూస్) దసరా దేవీ నవరాత్రుల సందర్భంగా విజయవాడలో భక్తులు, పర్యాటకులు, కళాభిమానులను ఆకట్టుకునేలా విజయవాడ ఉత్సవ్, జాతీయ సరస్సు మేళ నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. విజయవాడను సాంస్కృతిక, కళల వేదికగా మరోసారి చాటిచెప్పేలా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మీడియాతో ఎంపీ చిన్ని మాట్లాడుతూ.. దసరా సందర్భంగా లక్షలాది మంది భక్తులు విజయవాడకు తరలివస్తారని తెలిపారు. గత ఏడాది విజయవాడ ఉత్సవ్‌కు ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఈసారి మరింత విస్తృతంగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

### రెండు ఉత్సవాలు.. రెండు వారాల సంబరం

దేవీ నవరాత్రుల సందర్భంగా అక్టోబరు 11 నుంచి 20 వరకు విజయవాడ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు ఎంపీ తెలిపారు. అక్టోబరు 8 నుంచి 23 వరకు జాతీయ సరస్సు మేళ కొనసాగుతుందని చెప్పారు.

పున్నమిఘాట్‌లోని 18 ఎకరాల విస్తీర్ణంలో ప్రధాన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. మాకినేని బసవపున్నయ్య స్టేడియంలోనూ పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



# ప్రారంభించారు.. మూతపడింది

- ఇబ్రహీంపట్నం రైతుబజార్‌లో సన్నబియ్యం కౌంటర్‌కు తాళం
- ఆర్భాటంగా ప్రారంభించి.. కొద్దిరోజులకే బంద్
- తక్కువ ధరకు బియ్యం కోసం వస్తున్న పేదలకు నిరాశ
- కౌంటర్ పునఃప్రారంభించాలని వినియోగదారుల డిమాండ్





ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్) బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు సామాన్యులకు భారంగా మారుతున్న వేళ.. తక్కువ ధరకు బియ్యం అందించేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ కొద్దిరోజులకే మూతపడటంపై వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం రైతుబజార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సన్నబియ్యం కౌంటర్ ప్రస్తుతం పనిచేయకపోవడంతో బియ్యం కోసం వస్తున్న పేదలు, సామాన్యులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

### ఆర్భాటంగా ప్రారంభం.. ఆపై?

బియ్యం ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 3న ఇబ్రహీంపట్నం రైతుబజార్‌లో సన్నబియ్యం కౌంటర్‌ను స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. స్టీమ్డ్ బియ్యం కిలో రూ. 52, రా బియ్యం కిలో రూ. 50 చొప్పున అందించేలా ధరలు నిర్ణయించారు.
ప్రారంభ సమయంలో కౌంటర్ వద్ద బియ్యం కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఆసక్తి చూపారు. అయితే కొద్దిరోజులు గడవకముందే కౌంటర్ కార్యకలాపాలు నిలిచిపోయాయని స్థానికులు చెబుతున్నారు.

### ధరలు పైపైకి.. కౌంటర్‌కు తాళం

మరోవైపు బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు కిలో రూ. 65 నుంచి రూ. 90 వరకు ఉన్నాయని వినియోగదారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తక్కువ ధరకు బియ్యం లభిస్తుందనే ఆశతో రైతుబజార్‌కు వస్తున్న వారికి మూసివేసిన కౌంటర్ దర్శనమిస్తోంది. తక్కువ ధరకు బియ్యం అందించే కౌంటర్ అందుబాటులో లేకపోవడంతో బహిరంగ మార్కెట్ ధరలకే కొనుగోలు చేయాల్సి వస్తోందని పేదలు, సామాన్య వినియోగదారులు వాపోతున్నారు.

### ప్రారంభించిన లక్ష్యం ఏమైంది?

బహిరంగ మార్కెట్‌లో ధరల భారాన్ని తగ్గించి సామాన్యులకు ఊరట కల్పించడమే లక్ష్యంగా కౌంటర్‌ను ఏర్పాటు చేసినప్పుడు.. అదే కౌంటర్ కొద్దిరోజులకే ఎందుకు మూతపడిందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కౌంటర్ నిర్వహణలో ఎదురైన సమస్యలేమిటి? సరఫరా నిలిచిపోవడానికి కారణమేంటి? అధికారులు ఎందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదన్నది వినియోగదారుల ప్రశ్న.

### తక్షణమే తెరవాలి

ఇబ్రహీంపట్నం రైతుబజార్‌లో సన్నబియ్యం కౌంటర్‌ను తక్షణమే పునఃప్రారంభించి, గతంలో ప్రకటించిన ధరలకు బియ్యం అందుబాటులో ఉంచాలని స్థానికులు, వినియోగదారులు కోరుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం కాగితాలకే పరిమితం కాకుండా.. నిజంగా అవసరమైన పేదలకు ప్రయోజనం చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఖైరతాబాద్ గులాబీ అభ్యర్థిగా ప్రసన్న ముదిరాజ్.?

- దానంకు చెక్ పెట్టేందుకు బీసీ మహిళా అస్త్రం - కేసీఆర్ ఫ్యామిలీకి అత్యంత సన్నిహితురాలిగా పేరు
- త్వరలో రాబోయే ఉపఎన్నికపై బీఆర్ఎస్ అధిష్టానం కసరత్తు
- ఉద్యమ కాలం నుంచి పార్టీని నమ్ముకున్న నేతకు అవకాశం.?
- పోటీకి సీనియర్లు విముఖత.? - తెరపైకి వివాదరహిత ఉద్యమకారిణి పేరు
- సోమాజిగూడ డివిజన్ అధ్యక్షురాలి స్థాయి నుంచి పూర్తి స్థాయి కార్యకర్తగా 25 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం
- సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, ఢిల్లీ జంతర్ మంతర్ ధర్నాల్లో కీలకంగా పాల్గొన్న కే. ప్రసన్న

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) రాజధాని రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ఖైరతాబాద్ నియోజకవర్గంలో త్వరలో జరగబోయే ఉప ఎన్నిక రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఇక్కడ అధికార కాంగ్రెస్ పార్టీకి దీటుగా సమాధానం చెప్పేందుకు, బలమైన నేతగా ఉన్న దానం నాగేందర్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు బీఆర్ఎస్ అధిష్టానం ఇప్పటికే బలమైన అభ్యర్థి వేట మొదలుపెట్టింది. ఈ క్రమంలో గులాబీ బాస్ సరికొత్త రాజకీయ వ్యూహాన్ని రచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత రెండున్నర దశాబ్దాలుగా పార్టీనే నమ్ముకుని, వివాదరహితురాలిగా కొనసాగుతున్న బీసీ మహిళా నాయకురాలు కే. ప్రసన్న ముదిరాజ్‌ను బరిలోకి దింపే యోచనలో అధిష్టానం ఉన్నట్లు ప్రచారం ఊపందుకుంది.

### సీనియర్ల విముఖత.. తెరపైకి మహిళా అస్త్రం

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం, దానం నాగేందర్ వంటి సీనియర్ నేత ప్రత్యర్థిగా ఉండటంతో ఇక్కడ నుంచి సాధారణ నాయకులను పెడితే ఫలితం ఉండదని గులాబీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే పార్టీలోని కొందరు ముఖ్య నేతలు, తలసాని సాయి, దాసోజు శ్రవణ్ వంటి వారు ఈ ఉప ఎన్నికల బరిలో నిలబడేందుకు పెద్దగా ఆసక్తి చూపించడం లేదనే వార్తలు అంతర్గతంగా వినిపిస్తున్నాయి. దీంతో మహిళలకు పెద్దపీట వేయడంతో పాటు, సామాజిక సమీకరణాల పరంగా అత్యంత బలమైన బీసీ (ముదిరాజ్) వర్గానికి చెందిన మహిళా అభ్యర్థిని నిలబెడితే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని పార్టీ పెద్దలు సమాలోచనలు జరుపుతున్నారు.

కేసీఆర్ కుటుంబానికి సన్నిహితురాలిగా గుర్తింపు

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం (2001) నుంచే కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ, పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న నాయకురాలిగా కే. ప్రసన్నకు మంచి గుర్తింపు ఉంది. కేసీఆర్ కుటుంబానికి అత్యంత ఆప్తురాలిగా, వివాదరహిత నేతగా పేరు తెచ్చుకున్న ఆమెకు గతంలో మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం కూడా ఉంది. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీ మారకుండా, ఎలాంటి ఆరోపణలు లేకుండా పార్టీ గీత దాటని నిబద్ధత గల కార్యకర్తగా ఆమె పట్ల అధిష్టానానికి ప్రత్యేకమైన సానుకూలత ఉన్నట్లు పార్టీ




వర్గాలు చెబుతున్నాయి.

### 2001 నుంచి ఉద్యమ బాటలోనే..

కే. ప్రసన్న రాజకీయ ప్రస్థానం అంతా ఖైరతాబాద్ గడ్డతోనే ముడిపడి ఉంది. 2001--2002 లో సోమాజిగూడ డివిజన్ టీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి పార్టీ విస్తరణకు కృషి చేశారు.
- 2002లో సోమాజిగూడ డివిజన్ నుంచి టీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థిగా పోటీ చేశారు.
- 2003లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ఆ తర్వాత 2004 నుంచి 2007 వరకు రాష్ట్ర మహిళా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు.
- 2007 నుంచి నేటి వరకు పార్టీ కోసం పూర్తి స్థాయి కార్యకర్తగా నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నారు.

### లాఠీదెబ్బలు, అరెస్టులు.. తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగం..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలనలో టీడీపీ, ఎన్డీయే ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగిన ధర్నాలు, రాస్తారోకోల్లో ఆమె చురుగ్గా పాల్గొన్నారు. కేసీఆర్ ఇచ్చిన ప్రతి పిలుపును క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో ముందుండే ప్రసన్న, తెలంగాణ ఉద్యమ కాలంలో ఎన్నోసార్లు అరెస్టు అయ్యారు.
- హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు సాగిన టీఆర్ఎస్ కార్ ర్యాలీలో స్వయంగా పాల్గొన్నారు.
- ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నాలో తెలంగాణ గళాన్ని వినిపించారు.
- ఉద్యమంలో అత్యంత కీలకమైన పల్లెబాట, మిలియన్ మార్చ్, ట్యాంక్‌బండ్ సకల జనుల సమ్మె, రైల్ రోకో వంటి పోరాటాల్లో స్వయంగా పాల్గొని లాఠీలను, నిర్బంధాలను ఎదుర్కొన్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, పార్లమెంట్, అసెంబ్లీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నిరంతరం శ్రమించారు.

### లోకల్ క్యాడర్‌లో జోష్..

స్థానికంగా సోమాజిగూడలోనే నివాసముంటూ, సాధారణ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే బీఏ, డిప్లొమా ఇన్ కంప్యూటర్స్ చదివిన విద్యావంతురాలైన ప్రసన్నను బరిలోకి దించితే క్షేత్రస్థాయి కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వస్తుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అటు ఉద్యమ నేపథ్యం, ఇటు బీసీ వర్గం మద్దతు, స్వచ్ఛమైన రాజకీయ జీవితం ఆమెకు కలిసివచ్చే అంశాలుగా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఉపపోరులో అధికార పార్టీకి షాక్ ఇచ్చేలా కేసీఆర్ ఈ ఉద్యమ మహిళా నేత వైపే మొగ్గు చూపుతారా అనేది ఇప్పుడు రాజధాని రాజకీయాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

# వాట్సాప్‌కు సరికొత్త హంగులు

## - ఐఫోన్ తరహాలో డిజైన్!

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ తన ఆండ్రాయిడ్ యూజర్ల కోసం సరికొత్త డిజైన్‌ను తీసుకురాబోతోంది. ఐఫోన్ యాప్‌లో ఉన్న తరహాలో కింద ఉండే నావిగేషన్ బార్‌ను ఆకర్షణీయంగా మార్చేందుకు పరీక్షలు మొదలుపెట్టింది. ఈ కొత్త మార్పు వాట్సాప్ ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.26.38.10లో కనిపించింది. దీంతో త్వరలోనే ఆండ్రాయిడ్ యూజర్లకు వాట్సాప్ వాడకంలో కొత్త అనుభూతి కలగనుంది. ఈ కొత్త డిజైన్‌లో చాట్స్, కమ్యూనిటీస్, అప్‌డేట్స్, కాల్స్ వంటి ట్యాబ్‌లు ఉండే నావిగేషన్ బార్ గుండ్రని అంచులతో, మిగతా ఇంటర్‌ఫేస్ నుంచి విడిగా తేలియాడుతున్నట్టు (ఫ్లోటింగ్) కనిపిస్తుంది. యాపిల్ తన ఐఓఎస్ కోసం ఉపయోగిస్తున్న 'లిక్విడ్ గ్లాస్' డిజైన్‌కు దగ్గరగా ఈ మార్పు ఉంది. డార్క్ మోడ్ కంటే లైట్ థీమ్‌లో ఈ కొత్త లుక్ మరింత స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, వాట్సాప్ పూర్తిగా యాపిల్ డిజైన్‌ను కాపీ చేయకుండా, గూగుల్ డిజైన్ సూత్రాలనే అనుసరిస్తున్నట్టు తెలుస్తోంది. సుమారు మూడేళ్ల క్రితం వాట్సాప్ తన ఆండ్రాయిడ్ యాప్‌లో నావిగేషన్ ట్యాబ్‌లను పైనుంచి కిందకు మార్చింది. ఇప్పుడు దానికి మరిన్ని మెరుగులు దిద్దుతోంది. ఇటీవల చాలామంది ఆండ్రాయిడ్ యూజర్లు వాట్సాప్ లుక్ పాతబడిపోయిందని, ఆధునిక డిజైన్ తీసుకురావాలని సోషల్ మీడియాలో కోరుతున్నారు. ఈ ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలోనే వాట్సాప్ ఈ మార్పులకు శ్రీకారం చుట్టిందని భావిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ఫీచర్ అంతర్గత టెస్టింగ్ దశలోనే ఉంది. ఇంకా బీటా టెస్టర్లకు కూడా అందుబాటులోకి రాలేదు. యూజర్ల ఫీడ్‌బ్యాక్ వల్లే ఈ మార్పులు చేస్తున్నారా లేదా అనే విషయంపై గానీ, ఇది ఎప్పుడు అందరికీ అందుబాటులోకి వస్తుందనే దానిపై గానీ వాట్సాప్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.
ఇదిలా ఉండగా, వాట్సాప్ బిజినెస్ ఖాతాల ఏర్పాటును సులభతరం చేసేందుకు మెటా కొత్తగా 'వాట్సాప్ బిజినెస్ టూల్స్




ఎంసీపీ'ని కూడా ప్రారంభించింది. దీని ద్వారా చాట్‌జీపీటీ, క్లాడ్ వంటి ఏఐ కోడింగ్ టూల్స్ సహాయంతో వ్యాపారాలు సులభంగా వాట్సాప్ బిజినెస్ ఖాతాలను సెటప్ చేసుకోవచ్చు.

# రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

## - సిరిసిల్ల పర్యటనకు ముందు ప్రశ్నల వర్షం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దాదాపు మూడేళ్ల తర్వాత తొలిసారిగా సిరిసిల్ల నియోజకవర్గానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నలతో స్వాగతం పలికారు. కేవలం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు పరిమితం కాకుండా, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ సుదీర్ఘమైన బహిరంగ లేఖను విడుదల చేశారు.

### - 8 వేల ఎకరాల భూమిపై శ్వేతపత్రం ఏది?

అసెంబ్లీలో సీఎం చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ, సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది? స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి? ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### - నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ. 3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ. 20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు. "నేతన్నల బకాయిలు రూ. 60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10% యార్న్ సబ్సిడీ, రూ. 5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు? తేదీలు ప్రకటించాలి" అని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

### - రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది?

రైతుబంధును రూ. 15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ. 2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు? స్పష్టమైన తేదీలు ప్రకటించాలి" అని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ. 1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

### - అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ. 400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ. 1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ. 40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఆసరా పెన్షన్లను రూ. 4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ. 82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ. 12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

# ఆర్టీఐ పరిధి నుంచి 'లా అండ్ ఆర్డర్' శాఖకు మినహాయింపు

## - విజయ్ సర్కార్ సంచలన నిర్ణయం



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అత్యంత కీలకమైన పబ్లిక్ (శాంతిభద్రతలు) విభాగాన్ని సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 పరిధి నుంచి మినహాయించింది. ఈ శాఖను "ఇంటెలిజెన్స్ మరియు సెక్యూరిటీ ఆర్గనైజేషన్" (గూఢచార, భద్రతా సంస్థ)గా వర్గీకరిస్తూ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాష్ట్రంలో పారదర్శకత, జవాబుదారీతనంపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే, తమిళనాడు ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 21న మానవ వనరుల నిర్వహణ శాఖ ద్వారా జి ఓ నెం. 57 పేరిట ఒక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 24(4) ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలను ఉపయోగించి ఈ మినహాయింపు ఇచ్చినట్లు అందులో పేర్కొంది. ఈ సెక్షన్ ప్రకారం, రాష్ట్రాలు తమ పరిధిలోని గూఢచార, భద్రతా సంస్థలను ఆర్టీఐ చట్టం నుంచి మినహాయించే వెసులుబాటు ఉంది. ఇప్పుడు ఇదే నిబంధనను ఉపయోగించి, శాంతిభద్రతలను పర్యవేక్షించే ప్రధాన విభాగాన్ని ఈ జాబితాలో చేర్చారు.
ఈ నిర్ణయం వల్ల ఇకపై రాష్ట్రంలో జరిగే మత ఘర్షణలు, రాజకీయ ఆందోళనలు, పోలీసుల కాల్పులు, కస్టడీ మరణాలు, నిరసనలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్టీఐ ద్వారా పొందే అవకాశం ప్రజలకు ఉండదు. శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం తీసుకునే ఏ నిర్ణయాన్నీ ప్రశ్నించడం లేదా సమాచారం కోరడం సాధ్యపడదు. సాధారణంగా శాంతిభద్రతల విభాగం ప్రభుత్వ పరిపాలనలో అంతర్భాగం. దానిని ఒక గూఢచార సంస్థగా వర్గీకరించి ఆర్టీఐ నుంచి మినహాయించడం అనూహ్యమైన పరిణామం. ఈ చర్యతో పౌరులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు కీలకమైన సమాచారాన్ని తెలుసుకునే హక్కును కోల్పోతారు. ఇది ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను దెబ్బతీస్తుందని, అధికార దుర్వినియోగానికి ఆస్కారం కల్పిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా ఈ నిర్ణయం తమిళనాడులో తీవ్ర చర్చకు దారితీసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588